www.mudranews.in
సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
పాఠకులకు స్వాతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు
హైదరాబాద్
శుక్రవారం, 15.08.2026
www.mudranews.in | @mudranews
సంపుటి: 13 సంచిక: 285
పేజీలు: 08 వెల: రూ. 5

# స్మార్ట్ రేషన్ కార్డు

## 9 రకాల రక్షణలతో స్మార్ట్ కార్డు

- నకిలీ కార్డులకు చెక్.. పక్కా సెక్యూరిటీ
- యూవీ, హోలోగ్రామ్‌తో డబుల్ సెక్యూరిటీ
- క్యూఆర్ కోడ్‌తో క్షణాల్లో ధ్రువీకరణ
- ఆగస్టు 15 నుంచి లబ్ధిదారులకు పంపిణీ


Card Front Side

తెలంగాణ ప్రభుత్వం
Civil Supplies Department
Food Security Card (Ration Card)
Ration Card No. / రేషన్ కార్డు నెంబరు : 365371516636
Head of the Family / కుటుంబ యజమాని : Aithagani Vani
FP Shop No. / రేషన్ షాపు నెంబరు : 1592001
Issuing Authority

Card Back Side

గ్రామం / Village : Amangal
మండలం / Mandal : Amangal
జిల్లా / District : Rangareddy
చిరునామా / Residential Address : H.NO - 2-90, Amangal, Amangal, Amangal, Amangal, Rangareddy, 509321

1. Issuing Authority – Commissioner of Civil Supplies Signature
2. Hologram – Government of Telangana Emblem with 12 x 16 mm size
3. Relief Text – GOVERNMENT OF TELANGANA
4. Micro Text – GOVERNMENT OF TELANGANA

**ముద్ర హైదరాబాద్:**
తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్మార్ట్ రేషన్ కార్డు కేవలం లబ్ధిదారుల వివరాలను నమోదు చేసే పత్రం మాత్రమే కాదు. నకిలీలను నిరోధించడానికి అత్యాధునిక భద్రతా లక్షణాలతో రూపొందించబడింది. ముందు, వెనుక భాగాల్లో మొత్తం తొమ్మిది రకాల రక్షణ చర్యలు ఉండటం దీని ప్రత్యేకత. ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా వీటిని లబ్ధిదారులకు పంపిణీ చేయనున్నారు.

**కార్డు ముందు భాగంలో..**

కార్డు ముందు వైపు పైభాగంలో ''గవర్నమెంట్ ఆఫ్ తెలంగాణ'' అనే ఎంబోజ్డ్ ఆంగ్ల అక్షరాలు ఉన్నాయి. ఇవి స్పర్శతోనూ గుర్తించగలిగేలా రూపొందించబడ్డాయి. కుడివైపున యూవీ లైట్‌లో మాత్రమే కనిపించే ప్రభుత్వ అధికారిక చిహ్నం ఉంది. సాధారణ కాంతిలో కనిపించకపోవడం వల్ల నకిలీ కార్డులను సులభంగా గుర్తించవచ్చు. ఇక కింది భాగంలో తెలంగాణ ప్రభుత్వ అధికారిక చిహ్నంతో వాటర్‌మార్క్ ఉంది. ఇది కాగితం లోపలికి ముద్రించబడి, సాధార మిగతా 02లో

# పోలవరం, వెలిగొండపై సమీక్ష

వివరాలు అడిగి తెలుసుకున్న ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు

## 89.9 శాతం పూర్తైన పోలవరం సివిల్ పనులు

యుద్ధప్రాతిపదికన పోలవరం ఎడమ కాలువ పనులు
14 లక్షల క్యూసెక్కుల వరదలోనూ పనులకు ఆటంకం లేదు
గండి పోశమ్మ ఆలయ పరిరక్షణకు సీఎం ఆదేశాలు

**ముద్ర అమరావతి:**
ఆంధ్రప్రదేశ్‌లో కీలక సాగునీటి ప్రాజెక్టుల పనుల పురోగతిపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమీక్ష నిర్వహించారు. పోలవరం, వెలిగొండ ప్రాజెక్టులతో పాటు ప్రాధాన్యతా క్రమంలో పూర్తి చేయనున్న 36 ప్రాజెక్టులు, రాష్ట్రంలోని రిజర్వాయర్లలో నీటి నిల్వలు, నీటి విడుదల తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. లోటు వర్షపాతం పరిస్థితులు, భూగర్భ జలాల లభ్యత, తాగునీటి సరఫరా, నీటి నిర్వహణ ప్రణాళిక, జలధార–జలహారతి కార్యక్రమాల అమలుపై అధికారులకు సీఎం దిశానిర్దేశం చేశారు. మిగతా 02లో



- ఆటో డ్రైవర్లకు రూ.1.50 లక్షల వరకు సబ్సిడీ
- 7 రకాల సన్నాలకు క్వింటాలుకు రూ.500 బోనస్
- ఐటీఐలు, పాలిటెక్నిక్‌లు ఇక స్కిల్స్ యూనివర్సిటీ పరిధిలోకి
- మరో 7 యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూళ్లకు గ్రీన్ సిగ్నల్
- కొడంగల్ ఎత్తిపోతల ప్రాజెక్టుకు రూ.2,100 కోట్లు
- హైదరాబాద్ కాలుష్య పరిశ్రమలకు HILT గడువు పొడిగింపు
- 'ఇన్వెస్ట్ తెలంగాణ'తో భారీ పెట్టుబడులపై ఫోకస్

# డిసెంబర్‌లో సమ్మిట్

## తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2.0

కేబినెట్‌లో కీలక నిర్ణయాలు



**ముద్ర డెస్క్ :**
రాష్ట్రంలో రేపు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని తెలంగాణ మంత్రివర్గం నిర్ణయించింది. అందుకు సంబంధించి అన్ని జిల్లాల్లో ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించింది. ఇవాళ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన రాష్ట్ర సచివాలయంలో మంత్రివర్గ సమావేశం జరిగింది. ఈ భేటీలో పలు కీలక నిర్ణయాలపై చర్చించి నిర్ణయాలు తీసుకుంది. అలాగే హైదరాబాద్ మహానగరంలో కాలుష్యాన్ని అరికట్టి 'గ్రీన్ సిటీ'గా మార్చేందుకు కేబినెట్ మరో కీలక నిర్ణయం తీసుకుంది. నగరంలో ప్రస్తుతం ఉన్న 18,766 పెట్రోల్, డీజిల్ ఆటోరిక్షాలను ఎలక్ట్రిక్ వాహనాలుగా (EV) మార్చేందుకు రూ.200 కోట్లతో "తెలంగాణ ఆటో రిక్షా ఎలక్ట్రిక్ కన్వర్షన్ స్కీమ్" అమలుకు మంత్రిమండలి ఆమోదం తెలిపింది. ఈ పథకం కింద అర్హులైన ఆటో డ్రైవర్లకు ఒక్కో వాహనానికి గరిష్ఠంగా రూ.1,50,000 సబ్సిడీ అందిచనున్నారు. ఆటో డ్రైవర్లు తమ పాత ఆటోకు ఈవీ కిట్ అమర్చుకోవడానికి లేదా పాత వాహనాన్ని స్క్రాప్ చేసి కొత్త ఈ–ఆటో కొనుగోలు చేయడానికి ఈ సబ్సిడీ వర్తిపచేయనున్నారు.
గతేడాది తరహాలోనే ఈ ఏడాది కూడా 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2.0' నిర్వహించాలని కేబినెట్ నిర్ణయించింది. డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో ఈ సదస్సును నిర్వహించేందుకు ప్రాథమికంగా నిర్ణయించారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్ బాబు, మిగతా 02లో

## 80 ఏళ్ల స్వేచ్ఛ

# స్వాతంత్ర్యం

- విభజన వేళ మతవిద్వేషాల్లో ఎంతో మంది బలి
- ఆగస్టు 15న దేశ వ్యాప్తంగా 80వ స్వాతంత్ర్య సంబురాలు
- 2047 లక్ష్యంగా.. వికసిత్ భారత్ పరుగులు

## 79 ఏళ్లు పూర్తి.. 80వ స్వాతంత్ర్య వేడుకలు

ఒక్కరోజు ముందు పాకిస్తాన్‌కు



**ముద్ర డెస్క్:**
ప్రతి ఏడాది ఆగస్టు 15 వచ్చినప్పుడు దేశ వ్యాప్తంగా స్వాతంత్ర్య దినోత్సవ సంబరాలు ఘనంగా జరుగుతుంటాయి. ఎర్రకోటపై దేశ ప్రధాని నరేంద్ర మోడీ జెండా ఎగరవేస్తారు. ఆ తర్వాత దేశవ్యాప్తంగా స్వాతంత్ర్య వేడుకలు మొదలవుతాయి. అంబరాన్ని అంటే విధంగా సాగుతూ ఉంటాయి.
1947, ఆగస్టు 15న భారతదేశ తొలి స్వాతంత్ర్య దినోత్సవం జరుపుకుంది. 1948 ఆగస్టు 15న స్వాతంత్ర్యం వచ్చిన మరుసటి ఏడాది రెండవ ఇండిపెండెన్స్ డే జరిగింది. 2026 ఆగస్టు 15 నాటికి మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 79 సంవత్సరాలు పూర్తవుతాయి. ఈ ప్రకారం మన దేశం 80వ స్వాతంత్ర దినోత్సవ సంబరాలను జరుపుకుంటుంది.
ఈ సారి జరిగే స్వాతంత్ర్య వేడుకలకు యువశక్తి ఫర్ వికసిత్ భారత్ @1947 అనే నినాదాన్ని జోడించారు. వందేమాతరం గేయానికి సంబంధించిన 150 ఏళ్ల చరిత్రను కూడా స్పందించుకోబోతున్నారు. 2047 నాటికి భారతదేశానికి స్వాతంత్రం వచ్చి 100 సంవత్సరాలు పూర్తి అవుతాయి. అప్పటికి మన దేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దడంలో యువత పాత్ర ముఖ్యంగా ఉందని ఈ నేపథ్యం ఘనంగా చాటి చెబుతూ ఉంటుంది. శాస్త్ర.. సాంకేతిక.. హరిత ఇంధనం.. రక్షణ రంగంలో స్వావలంబన.. ఆవిష్కరణలు వంటి వాటికి విశేషమైన ప్రాధాన్యం ఇవ్వబోతున్నారు. ఇక ఇదే సమయంలో స్వాతంత్ర్య ఉద్యమంలో ప్రజలకు స్ఫూర్తి ఇచ్చిన జాతీయగీతం.. వందేమాతరానికి సంబంధించి 150 సంవత్సరాల ప్రస్థానాన్ని గుర్తు మిగతా 02లో




## కాంగ్రెస్ లో 02

# రాజగోపాల్ రచ్చ..

### రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యలపై పీసీసీ చీఫ్ ఫైర్

పార్టీ కంటే ఎవరూ పెద్దవారు కాదన్న మహేష్ గౌడ్

- మంత్రి పదవి కోసమేనా రాజగోపాల్ రెడ్డి అసంతృప్తి?
- సీనియర్లకు అన్యాయం జరుగుతోందంటున్న రాజగోపాల్
- కాంగ్రెస్‌లో పాత, కొత్త నేతల మధ్య మళ్లీ రచ్చ

## జేపీ నడ్డాకు 02

# తీవ్ర అస్వస్థత

- ఛాతీలో అసౌకర్యంతో ఎయిమ్స్ లో చేరిక
- కరోనరీ యాంజియోగ్రఫీ చేసిన వైద్యులు..
- నిలకడగా ఉందని వెల్లడి



## రాహుల్ గాంధీకి 02

# సుప్రీం ఊరట..

- పరువు నష్టం కేసును కొట్టేసిన సుప్రీం
- క్రిమినల్ కేసు, దిగువ కోర్టు సమన్లు రద్దు చేసిన సుప్రీంకోర్టు



## సీఎం కుటుంబంపై

# బీఆర్ఎస్ ఫిర్యాదు

### టెస్సరాక్ట్ భూకేటాయింపులపై విచారణ కోరిన ప్రతిపక్షం 02

- రూ.200 కోట్ల భూములా?
- భూ కేటాయింపులు రద్దు చేయాలి..
- రేవంత్ కుటుంబంపై దర్యాప్తు చేయాలి

# పాక్ ప్రధాని వార్నింగ్

## నీటి విషయంలో తగ్గేదేలే.. అంటూ ప్రేలాపనలు 02

- సింధూ జలాలపై పాక్ మరోసారి కవ్వింపు
- ప్రతి నీటి బొట్టూ రెడ్‌లైన్
- భారత్ వైఖరి మార్చుకోకపోతే స్పందిస్తాం



ఇదీ AI ముద్ర



M-15-08-02_Layout 1 8/14/2026 10:31 PM Page 1

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
శనివారం, 15.08.2026
www.mudranews.in | @mudranews



## కొలెస్ట్రాల్ తగ్గించేందుకు పెసరపప్పు



పొట్టు తీయని పెసరపప్పు లోని ఫైబర్ చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో, గుండె ఆరోగ్యాన్ని కాపాడ డంలో సహాయపడు తుంది.

# రాహుల్ కు ఊరట

**ముద్ర, ఢిల్లీ :**
కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీకి సుప్రీం కోర్టులో తాజాగా ఊరట దక్కింది. సావర్కర్‌పై వ్యాఖ్యలకు సంబంధించి నేరుపూరిత పరువు నష్టం కేసును సర్వోన్నత న్యాయస్థానం తాజాగా కొట్టేసింది. ఈ కేసులో లఖ్నవూ మెజిస్ట్రేట్ జారీ చేసిన సమన్లను కోర్టు కొట్టేసింది. ఈ కేసుకు సంబంధించిన ముందస్తు అనుమతులను రాష్ట్ర ప్రభుత్వం జారీ చేయలేదని పేర్కొంది. భారత్ జోడో యాత్ర సందర్భంగా ఎంపీ రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు అప్పట్లో వివాదాస్పదమైన విషయం తెలిసిందే.



రాహుల్ వ్యాఖ్యలపై అభ్యంతరం చెబుతూ నృపేంద్ర పాండే కేసు దాఖలు చేసేందుకు ప్రయత్నించారు. సెక్షన్ 153ఏ కింద కేసు నమోదు కోసం అడిషనల్ చీఫ్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్‌ను ఆశ్రయించారు. అయితే, ఈ పిటిషన్‌ను ఏసీజేఎమ్ తోసిపుచ్చారు. ఈ తీర్పును పిటిషనర్ సెషన్స్ కోర్టులో సవాలు చేయగా న్యాయస్థానం కేసును మళ్లీ మెజిస్ట్రేట్‌కు బదిలీ చేసింది. ఈ క్రమంలో లఖ్నవూ మెజిస్ట్రేట్ రాహుల్ గాంధీకి సమన్లు జారీ చేశారు. సమన్లను సవాలు చేస్తూ రాహుల్ గాంధీ హైకోర్టును ఆశ్రయించారు. తమపై క్రిమినల్ చర్యలను కొట్టేయాలని అభ్యర్థించారు. అయితే, ఈ దశలో తాము జోక్యం చేసుకోలేమని అలహాబాద్ హైకోర్టు తేల్చి చెప్పింది. సెషన్స్ కోర్టులో రివిజన్ పిటిషన్ దాఖలు చేసుకోవాలని రాహుల్ గాంధీకి సూచించింది.
ఈ క్రమంలో సుప్రీం కోర్టును ఆశ్రయించిన రాహుల్ గాంధీకి తాజాగా ఊరట దక్కింది. సెక్షన్ 153ఏ కింద చర్యలు చేపట్టేందుకు కేంద్రం లేదా రాష్ట్ర ప్రభుత్వాల ముందస్తు అనుమతి లేని కారణంగా రాహుల్‌పై దాఖలైన కేసును కొట్టేస్తున్నట్టు పేర్కొంది. అయితే, స్వాతంత్ర సమరయోధుల గురించి ఇలాంటి వ్యాఖ్యలు భవిష్యత్తులో చేయొద్దని కూడా సుప్రీం రాహుల్ గాంధీకి స్పష్టం చేసింది.

# పాక్ ప్రధాని వార్నింగ్

**ముద్ర ఢిల్లీ :**
సింధూ జలాల ఒప్పందం విషయంలో పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ మరోసారి భారత్‌పై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. తమ దేశానికి రావాల్సిన నీటిలో ప్రతి చుక్కా కీలకమేనని, నీటి హక్కులకు భంగం కలిగించేలా భారత్ వ్యవహరిస్తే గట్టిగా స్పందిస్తామని హెచ్చరించారు. పాకిస్థాన్ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఇస్లామాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో ఈ వ్యాఖ్యలు చేశారు.
భారత్‌తో తాము శాంతిని కోరుకుంటున్నామని, అయితే దాన్ని బలహీనతగా భావించవద్దని షెహబాజ్ అన్నారు. 2025 మేలో జరిగిన ఘర్షణల కంటే గట్టిగా స్పందించగలమని హెచ్చరించారు.
పహల్గాం ఉగ్రదాడి అనంతరం భారత్ సింధూ జలాల ఒప్పందాన్ని నిలిపివేసిన విషయం తెలిసిందే. సీమాంతర ఉగ్రవాదాన్ని ఆపే వరకు నీటి అంశంపై పునరాలోచించే ప్రసక్తి లేదని భారత్ ఇప్పటికే స్పష్టం చేసింది. మరోవైపు, 2025 భారత్–పాక్ కాల్పుల విరమణకు డొనాల్డ్ ట్రంప్ చేసిన జోక్యాన్ని షెహబాజ్ ప్రశంసించారు. కాల్పుల విరమణ ఇరు దేశాల సైనిక అధికారుల చర్చలతోనే కుదిరిందని భారత్ చెబుతోంది.

# జేపీ నడ్డాకు తీవ్ర అస్వస్థత

**ముద్ర ఢిల్లీ :**
కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి జేపీ నడ్డా గురువారం ఢిల్లీ ఎయిమ్స్ ఆస్పత్రిలో చేరారు. గురువారం ఆయన అస్వస్థతకు గురికావడంతో కుటుంబ సభ్యులు ఆయనను ఢిల్లీ ఎయిమ్స్‌లో చేర్చారు. ప్రస్తుతం ఆయన వైద్యుల పర్యవేక్షణలో ఉన్నారు. నడ్డా వయసు 65. ఈ నేపథ్యంలో ఆయనకు ఢిల్లీ ఎయిమ్స్ వైద్యులు అనేక రకాల పరీక్షలు నిర్వహించారు. వాటిలో కరోనరీ యాంజియోగ్రఫీ పరీక్ష కూడా ఉంది.
ప్రస్తుతం జేపీ నడ్డా ఆరోగ్యం నిలకడగా ఉందని, కార్డియాలజీ వైద్యుల పర్యవేక్షణలో ఉన్నారని ఆస్పత్రివర్గాలు ఒక ప్రకటనలో తెలిపాయి. గురువారం సాయంత్రం ఆయన ఆస్పత్రిలో చేరినట్లు వెల్లడించాయి. అయితే, ఆయనకు గల అనారోగ్య సమస్యకు సంబంధించిన వివరాల్ని మాత్రం వివరించలేదు. సాధారణంగా గుండె రక్త నాళాల్లో ఏదైనా సమస్య, అడ్డంకి ఉందా అని తెలుసుకునేందుకు వైద్యులు కరోనరీ యాంజియోగ్రఫీ పరీక్ష నిర్వహిస్తారు. ఇందులో ఏదైనా సమస్య తలెత్తితే అవసరమైన శస్త్ర చికిత్స చేయాల్సి ఉంటుంది. జేపీ నడ్డా గతంలో బీజేపీ జాతీయాధ్యక్షుడిగా పని చేశారు.
ఆ తర్వాత ఆయన కేంద్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. దీంతో బీజేపీ జాతీయాధ్యక్షుడిగా నితిన్ నబిన్ చేపట్టారు. మోదీ క్యాబినెట్‌లో నడ్డా కీలకంగా ఉన్నారు. మోదీ, అమిత్ షాలకు అత్యంత సన్నిహితుడు. ఇదే సమయంలో పార్టీని జాతీయ స్థాయిలో బలోపేతం చేసిన నేతగానే కాకుండా, వివిధ రాష్ట్రాల్లో అధికారంలోకి తెచ్చిన నాయకుడిగా పేరుంది.

## సీఎం కుటుంబంపై
# లోకాయుక్తలో ఫిర్యాదు

**ముద్ర, హైదరాబాద్ :**
తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి కుటుంబంపై బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు లోకాయుక్తలో ఫిర్యాదు చేశారు. రేవంత్ కుటుంబం భూ అక్రమాలకు పాల్పడుతోందని పేర్కొన్నారు. టెస్సరాక్ట్ కంపెనీకి రూ.200 కోట్ల విలువైన భూములను కేటాయించారని ఆరోపించారు.టెస్సరాక్ట్ కంపెనీ సీఎం తమ్ముడు కొండల్‌రెడ్డికి చెందినదని ఫిర్యాదులో పేర్కొన్నారు.
'రావిర్యాలలో ఐదెకరాల భూమిని రూ.7కోట్లకు ధారాదత్తం చేశారు. టెస్సరాక్ట్ కంపెనీ మూలధనం రూ.లక్ష మాత్రమే. కొండల్‌రెడ్డి ఛైర్మన్‌గా.. నయన్‌రెడ్డి సీఈవోగా ఉన్నారు. ఆ భూ కేటాయింపులు రద్దు చేయాలి. దీనిలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబు, టీజీఐఐసీ అధికారుల పాత్రపై విచారణ జరిపించాలి' అని ఫిర్యాదులో బీఆర్ఎస్ నేతలు కోరారు.

# తెలంగాణ స్మార్ట్ రేషన్ కార్డు

(మొదటి పేజీ తరువాయి)
ణంగా కాపీ చేయడం కష్టం. కుడివైపు కింద పౌరసరఫరాల శాఖ కమిషనర్ డిజిటల్ సంతకం ఉండటం అధికారికతను మరింత ధ్రువీకరిస్తుంది.




**కార్డు వెనుక భాగంలో..**
స్మార్ట్ రేషన్ కార్డు వెనుకవైపు పై భాగంలో గిల్లోష్ సెక్యూరిటీ ప్యాటర్న్ ఉంది. ఇది సన్నని, క్లిష్టమైన రేఖలతో కూడిన నమూనా. నకిలీలు చేయడానికి ఇలాంటి ప్యాటర్న్‌ను సరిగ్గా అనుకరించడం చాలా కష్టం. కుడివైపున సురక్షితమైన క్యూఆర్ కోడ్ ఉంది. దీన్ని స్కాన్ చేస్తే లబ్ధిదారుని వివరాలు వెంటనే తెలుస్తాయి. ఇది ఆన్‌లైన్ ధ్రువీకరణకు ఉపయోగపడుతుంది. కింది భాగంలో తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక హోలోగ్రామ్ ఉంది. కాంతి కోణం మారినప్పుడు రంగు మారే ఈ హోలోగ్రామ్ నకిలీలను నిరోధిస్తుంది. ఇక ఎడమవైపు 'గవర్నమెంట్ ఆఫ్ తెలంగాణ' అనే పదాలను సూక్ష్మంగా (మైక్రో ప్రింటింగ్) ముద్రించారు. సాధారణ కంటితో చదవడం కష్టం, కానీ మాగ్నిఫైయింగ్ గ్లాస్‌తో స్పష్టంగా కనిపిస్తాయి. మధ్య భాగంలో ప్రత్యేక కోణంలో చూస్తే మాత్రమే కనిపించే "GOTG ORIGINAL' అనే ఆంగ్ల పదాలు ఉన్నాయి.

**ఈ రక్షణల ప్రాధాన్యత..**
ఈ తొమ్మిది రకాల భద్రతా లక్షణాలు కలిసి రేషన్ కార్డు నకిలీలను గణనీయంగా తగ్గించే అవకాశం ఉంది. ఎంబోసింగ్, యూవీ చిహ్నం, వాటర్‌మార్క్, హోలోగ్రామ్, మైక్రో ప్రింటింగ్, గిల్లోష్ ప్యాటర్న్, క్యూఆర్ కోడ్, డిజిటల్ సంతకం, కోణాధారిత పదాలు.. ఇవన్నీ వివిధ స్థాయిల్లో రక్షణను అందిస్తాయి. సాధారణ ప్రింటర్లు లేదా సాధారణ సాంకేతికతతో ఇవన్నీ అనుకరించడం దాదాపు అసాధ్యం. లబ్ధిదారులకు ప్రయోజనం ఏమిటంటే, వారి కార్డు ప్రామాణికమైనదని సులభంగా నిర్ధారించుకోవచ్చు. అధికారులు యూవీ లైట్, స్కానర్, కోణం మార్చి చూడటం వంటి సాధారణ పద్ధతులతోనే నకిలీలను గుర్తించగలరు. ఇది ప్రభుత్వ సబ్సిడీల దుర్వినియోగాన్ని నివారించి, నిజమైన అర్హులకు ప్రయోజనాలు చేరేలా చేస్తుంది. తెలంగాణ స్మార్ట్ రేషన్ కార్డు ఆధునిక భద్రతా సాంకేతికతను ఉపయోగించి పౌరుల విశ్వాసాన్ని పెంచే దిశగా ముందడుగు వేసింది. ఈ రక్షణ సరిగ్గా అమలైతే రేషన్ వ్యవస్థలో పారదర్శకత, నమ్మకం మరింత పెరుగుతాయి.

# 80 ఏళ్ల స్వేచ్ఛ స్వాతంత్ర్యం

(మొదటి పేజీ తరువాయి)
చేసుకోబోతున్నారు. ఈ ఏడాది వేడుకలలో నిలువబోతోంది. ఇక నాటిన 47 ఆగస్టు 14 అర్ధరాత్రి దాటి న తర్వాత భారతదేశం స్వాతంత్ర్యాన్ని పొందిది. దాదాపు రెండు శతాబ్దాల బ్రిటిష్ వలస పరిపాలనకు భారతదేశం ముగింపు పలికింది. స్వేచ్ఛ దేశంగా అవతరించింది. భారతదేశం సాగించిన స్వాతంత్ర్య పోరాటంలో గాంధీ.. నెహ్రూ.. పటేల్.. భగత్ సింగ్ వంటి అనేక మంది నాయకులు ముఖ్యపాత్ర పోషించారు. వారి త్యాగాలు.. చేసిన పోరాటాల వల్లే భారతదేశానికి స్వాతంత్ర్యం లభించింది. నటించి 47 ఇండియన్ ఇండిపెండెన్స్ యాక్ట్ ద్వారా భారతదేశం స్వతంత్ర దేశంగా అవతరించింది. స్వాతంత్రం సాధించిన అనంతరం భారతదేశానికి తొలి ప్రధానమంత్రిగా నెహ్రూ వ్యవహరించారు. నాడు ఆయన ఎర్రకోట నుంచి జాతీయ జెండాను ఎగరవేసి.. జాతిని ఉద్దేశించి ప్రసంగించారు. ప్రతి ఏడాది స్వాతంత్ర్య వేడుకలు న్యూఢిల్లీలోని ఎర్రకోటలో ఘనంగా జరుగుతాయి. దేశ ప్రధాని నరేంద్ర మోడీ జాతీయ జెండాను ఎగరేస్తారు. దేశ ప్రజలను ఉద్దేశించే ప్రసంగిస్తారు. అనంతరం 21 తుపాకుల గౌరవ వందనం స్వీకరిస్తారు. దేశవ్యాప్తంగా ఆగస్టు 15న ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలలో జాతీయ జెండాలు ఆవిష్కరిస్తారు. మహనీయుల త్యాగాలను స్మరించుకుంటారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. కాబట్టి 2026 ఆగస్టు 15న భారతదేశ స్వాతంత్ర్యం పొంది 79 ఏళ్లు పూర్తి చేసుకున్నప్పటికీ.. జరుపుకునేది మాత్రం ముమ్మాటికి 80వ స్వాతంత్ర్య వేడుకలే.




# డిసెంబర్‌లో సమ్మిట్

(మొదటి పేజీ తరువాయి)
ఉత్తమ్ కుమార్ రెడ్డి, వివేక్ వెంకటస్వామి ఆధ్వర్యంలో సబ్ కమిటీలను ఏర్పాటు చేయనున్నారు. 'ఇన్వెస్ట్ తెలంగాణ' థీమ్‌తో జరిగే ఈ సదస్సులో 'ఫ్యూచర్ సిటీ ప్లాన్'ను ప్రభుత్వం ఆవిష్కరించనుంది. డిఫెన్స్, ఏరోస్పేస్, ఫార్మా రంగాల్లో పెట్టుబడుల ఆకర్షణే లక్ష్యంగా స్టార్టప్స్, కొత్త ఆవిష్కరణలతో భారీ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయనున్నారు.

**7 రకాల సన్నాలకు రూ.500 బోనస్!**
వానాకాలం పంటకు సంబంధించి ఏడు రకాల సన్న ధాన్యం సాగును ప్రోత్సహించేందుకు రైతులకు రైతు వేదికలు, గ్రామ పంచాయతీల ద్వారా విస్తృత అవగాహన కల్పించాలని కేబినెట్ నిర్ణయించింది. ఈ ఏడాది నుంచి ఈ 7 రకాల సన్నాలకు క్వింటాలుకు రూ.500 బోనస్ చెల్లించనున్నారు. యాసంగి ధాన్యం సేకరణలో తెలంగాణ దేశంలోనే మొదటి స్థానంలో నిలిచింది. రికార్డు స్థాయిలో 81.16 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించగా, కేంద్రం కేవలం 63.62 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే తీసుకుంటుంది. మిగిలిన 17.54 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ఈ వేలం ద్వారా విక్రయించేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఇటీవల మొక్కజొన్న వేలంతో రాష్ట్ర ప్రభుత్వం ఆదాయం రాబట్టుకున్న నేపథ్యంలో ఈ మిగులు ధాన్యానికి కూడా క్వింటాలుకు రూ.2389 బేసిక్ ప్రైస్ నిర్ణయించి.. ఈ వేలం (e-Auction) ద్వారా ధాన్యం అమ్మాలని కేబినెట్ నిర్ణయించింది.

**విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు**
రాష్ట్రంలోని ఐటీఐలు, ఏటీసీలు, పాలిటెక్నిక్ కాలేజీలను యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ పరిధిలోకి తీసుకురావడానికి క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ప్రస్తుతం ఐటీఐలు, ఏటీసీలు, పాలిటెక్నిక్ కళాశాలలు సాంకేతిక విద్యా శాఖ పరిధిలో ఉన్నాయి. వీటిని తెలంగాణ ఎడ్యుకేషన్ యాక్ట్ నుంచి తొలగించి యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ (YISU) పరిధిలో చేర్చేందుకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ప్రస్తుతం పరిశ్రమల శాఖ పరిధిలో ఉన్న వీటన్నింటినీ ఇకపై శక్తి శాఖ పరిధిలోకి విలీనం చేసేందుకు క్యాబినెట్ తీర్మానించింది.

**మరో 7 యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్**
ఆదిలాబాద్, నిర్మల్, ముధోల్, బోథ్, సిర్పూర్, గజ్వేల్, దుబ్బాక నియోజకవర్గాల్లో కొత్తగా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణానికి ఆమోదం తెలిపారు. దీంతో ఇప్పటివరకు మంజూరైన స్కూళ్ల సంఖ్య 86కి చేరింది. వచ్చే విద్యా సంవత్సరం నుంచే తరగతులు ప్రారంభించాలని సీఎం ఆదేశించారు.

**కొడంగల్ ఎత్తిపోతలకు రూ. 2,100 కోట్లు**
మక్తల్–నారాయణపేట–కొడంగల్ ఎత్తిపోతల ప్రాజెక్టు ఫేజ్–2 పనుల కోసం రూ. 2,100 కోట్ల అంచనా వ్యయానికి కేబినెట్ ఆమోదం తెలిపింది. దీని ద్వారా లక్ష ఎకరాలకు సాగునీరు, తాగునీరు అందుతుంది. అలాగే గూడెం దొడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు సామర్థ్యాన్ని 1.19 టీఎంసీల నుంచి 15 టీఎంసీలకు పెంచడంతో పాటు సోలార్ విద్యుత్ ఉత్పత్తిపై అధ్యయనానికి కన్సల్టెంట్‌ను నియమించనున్నారు.

**HILT పాలసీ గడువు పెంపు**
హైదరాబాద్ నగరంలోని కాలుష్య కారక పరిశ్రమలను శివార్లకు తరలించే HILT పాలసీ దరఖాస్తుల గడువును దరఖాస్తుదారుల విజ్ఞప్తి మేరకు అక్టోబర్ 31 వరకు (మరో 3 నెలలు) పొడిగిస్తూ కేబినెట్ నిర్ణయం తీసుకుంది.

## పోలవరం, వెలిగొండ పనులపై
# సీఎం సమీక్ష

(మొదటి పేజీ తరువాయి)
పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి నిన్న టి వరకు 89.9 శాతం సివిల్ పనులు పూర్తయ్యాయని అధికారులు సీఎంకు వివరించారు. ప్రాజెక్టు ఎడమ కాలువ పను లను యుద్ధప్రాతిపదికన పూర్తి చేస్తున్నామని జలవనరుల శాఖ అధికారులు తెలి పారు. ఈసీఆర్ఎఫ్ డ్యామ్ గ్యాప్–1, గ్యాప్–2లోనూ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని వెల్లడించారు. డ్యామ్ సైట్ వద్ద రహదారులు, ఇతర మౌలిక వసతుల పనులను కూడా త్వరితగతిన పూర్తి చేయాలని చంద్రబాబు సూచించారు. ప్రాజెక్టు సమీపంలోని గండి పోశమ్మ ఆలయాన్ని పరిరక్షిస్తూ, స్థానికుల సెంటిమెంట్‌కు ఎలాంటి ఇబ్బంది కలగకుండా కార్యాచరణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు.



ఇటీవల కాలంలో పోలవరం ప్రాంతంలో 14 లక్షల క్యూసెక్కుల వరకు వరద ప్రవాహాలు వచ్చినప్పటికీ, పనులకు అంతరాయం కలగకుండా కొనసాగించామని అధికారులు సీఎంకు వివరించారు. ప్రాజెక్టు పనులను నిర్దేశిత గడువుల్లో పూర్తి చేసేందుకు సమన్వయంతో ముందుకు వెళ్లాలని సీఎం సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో మంత్రి నిమ్మల రామానాయుడు, జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శశిభూషణ్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌లో రాజగోపాల్ రచ్చ..

**ముద్ర, హైదరాబాద్:**
తెలంగాణ కాంగ్రెస్‌లో మరోసారి అంతర్గత విభేదాలు బయటపడ్డాయి. మునుగోడు ఎమ్మెల్యే కోమటి రెడ్డి రాజగోపాల్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు పార్టీలో తీవ్ర చర్చకు దారితీశాయి. సీనియర్ నేతలకు గుర్తింపు లేదని, ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికి ప్రాధాన్యత దక్కుతోందని ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. పార్టీ కోసం ఏళ్ల తరబడి పనిచేసిన కార్యకర్తలకు అన్యాయం జరుగుతోందని ఆరోపించారు.
తెలంగాణ అభివృద్ధి నిధులు ఆంధ్ర కాంట్రాక్టర్లకే దక్కుతున్నాయని, సీమాంధ్ర పాలకుల మీడియా ప్రభావంలో ప్రభుత్వం ఉండకూడదని ఆయన ఘాటు వ్యాఖ్యలు చేశారు.



పేదల ఇందిరమ్మ ఇళ్లకు నిబంధనల పేరుతో ఇబ్బందులు పెడుతున్నారని, మరోవైపు భారీ ప్రాజెక్టుల పేరుతో దోపిడీ జరుగుతోందని విమర్శించారు.

**మంత్రి పదవే టార్గెటా?**
రాజగోపాల్ రెడ్డి చాలాకాలంగా మంత్రి పదవి ఆశిస్తున్నారనే ప్రచారం కాంగ్రెస్ వర్గాల్లో ఉంది. త్వరలో మంత్రివర్గ విస్తరణ ఉంటుందనే నేపథ్యంలోనే ఆయన తన అసంతృప్తిని బహిరంగంగా వ్యక్తం చేస్తున్నారనే చర్చ సాగుతోంది. ఈసారి మంత్రివర్గంలో చోటు దక్కించుకునేందుకు పార్టీపై ఒత్తిడి పెంచుతున్నారా? అనే ప్రశ్నలున్నాయి.

**పీసీసీ చీఫ్ ఘాటు వార్నింగ్**
రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యలపై టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ తీవ్రంగా స్పందించారు. పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘిస్తే ఎవరినీ ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి నుంచి సాధారణ కార్యకర్త వరకు అందరికీ ఒకే రూల్ బుక్ ఉంటుందని, పార్టీ కంటే ఎవరూ పెద్దవారు కాదని తేల్చి చెప్పారు. మంత్రిపదవులు, ఇతర కీలక పదవులపై తుది నిర్ణయం హైకమాండ్‌దేనని అన్నారు. అందరి కోరికలను ఒకేసారి తీర్చడం సాధ్యం కాదని స్పష్టం చేశారు. ఈ వ్యవహారాన్ని అవసరమైతే క్రమశిక్షణ కమిటీ లేదా హైకమాండ్ దృష్టికి తీసుకెళ్తామని సంకేతాలు ఇచ్చారు.

**పాత, కొత్త నేతల మధ్య కోల్డ్‌వార్?**
కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి పాత కాంగ్రెస్ నేతలు, ఇతర పార్టీల నుంచి వచ్చిన నేతల మధ్య సమన్వయం విషయంలో అప్పుడప్పుడు విభేదాలు బయటపడుతున్నాయి. సీనియర్లకు తగిన గుర్తింపు లేదనే అసంతృప్తి కొంతకాలంగా పార్టీలో ఉంది. రాజగోపాల్ రెడ్డి తాజా వ్యాఖ్యలతో ఈ విభేదాలు మరోసారి తెరపైకి వచ్చాయి.
మొత్తంగా రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యలు, పీసీసీ చీఫ్ హెచ్చరికలతో తెలంగాణ కాంగ్రెస్‌లో వాతావరణం వేడెక్కింది. ఇక మంత్రివర్గ విస్తరణలో ఎవరికి చోటు దక్కుతుంది? ఈ వివాదంపై హైకమాండ్ ఎలా స్పందిస్తుంది? అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
శనివారం 15.08.2026
www.mudranews.in | @mudranews



## బీపీ, బ్లోటింగ్‌కు పసువు పెసరపప్పు

పొట్టు తీసిన పెసరప ప్పులోని పొటాషియం, మెగ్నీషియం బీపీ నియంత్రణకు తోడ్పడతాయి. ఇది తేలికగా జీర్ణమవుతుంది.



# స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలతో వ్యవసాయ రంగానికి ముప్పు

**- రిటైర్డ్ ప్రొఫెసర్ ఆరిబండి ప్రసాదరావు**





**ముద్ర ప్రతినిధి, ఖమ్మం, 14 :** స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలతో వ్యవసాయ రంగానికి ముప్పు ఉందని అగ్రికల్చర్ యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ ఆరిబండి ప్రసాదరావు తెలిపారు. అధ్యయనశీలి, ఆచరణవాది, ప్రజా సమస్యలపై నిరంతరం అధ్యయనం చేస్తూ వాటి పరిష్కారం కోసం ఉద్యమించిన నర్వనేని సత్యనారాయణ 5వ వర్ధంతి సందర్భంగా సిపిఐ(ఎం) వైరా మండల కమిటీ ఆధ్వర్యంలో ముసలిమడుగు గ్రామంలో "భారత స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు – వ్యవసాయ రంగంపై ప్రభావం" అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. ఈ సెమినార్‌కు ముఖ్య వక్తగా హాజరైన అగ్రికల్చర్ యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ ఆరిబండి ప్రసాదరావు మాట్లాడుతూ, ప్రపంచీకరణ, సరళీకరణ విధానాల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం వివిధ దేశాలతో కుదుర్చుకుంటున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు భారత వ్యవసాయ రంగంపై దీర్ఘకాలిక చెడు ప్రభావం చూపే అవకాశం ఉందన్నారు. దేశీయ రైతుల ప్రయోజనాలను పరిగణనలోకి తీసుకోకుండా వ్యవసాయ ఉత్పత్తుల దిగుమతులకు మార్గం సుగమం చేస్తే, తక్కువ ధరలకు విదేశీ ఉత్పత్తులు దేశీయ మార్కెట్‌లోకి ప్రవేశించే ప్రమాదం ఉందని తెలిపారు. ఇప్పటికే పెరుగుతున్న సాగు ఖర్చులు, విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, డీజిల్, విద్యుత్ ధరల భారంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో విదేశీ వ్యవసాయ ఉత్పత్తులతో దేశీయ రైతులు పోటీ పడాల్సి వస్తే రైతులకు గిట్టుబాటు ధర లభించకపోవడంతో వ్యవసాయం మరింత సంక్షోభంలోకి వెళ్లే ప్రమాదం ఉందని హెచ్చరించారు. రైతు పండించిన పంటకు ధర నిర్ణయించే హక్కు రైతుకు ఉండాలని, మార్కెట్‌లో రైతు రక్షణకు ప్రభుత్వం బాధ్యత వహించాలని ఆయన పేర్కొన్నారు. వ్యవసాయాన్ని కేవలం మార్కెట్ సరుకుగా చూడకుండా దేశ ఆహార భద్రత, గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా చూడాల్సిన అవసరం ఉందన్నారు. స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలపై పారదర్శకమైన చర్చ జరగాలని, వాటి వల్ల ఏ పంటలకు, ఏ ప్రాంతాల రైతులకు, ఏ విధమైన ప్రభావం ఉంటుందనే విషయాలను ప్రజలకు ప్రభుత్వం స్పష్టంగా వివరించాలని డిమాండ్ చేశారు. దేశీయ రైతులకు రక్షణ కల్పించే విధానాలు రూపొందించకుండా అంతర్జాతీయ మార్కెట్ పోటీకి రైతులను వదిలేయడం సరికాదన్నారు. రైతుల ప్రయోజనాలకు ప్రభుత్వ రక్షణ అవసరం అని అన్నారు*

**-రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు ప్రజా ఉద్యమాలను బలోపేతం చేయాలి : సిపిఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు**

సెమినార్ లో ప్రారంభం ఉపన్యాసం చేసిన సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు ప్రజా ఉద్యమాలను బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. రైతులకు కనీస మద్దతు ధర, ప్రభుత్వ కొనుగోలు వ్యవస్థ, చౌకైన వ్యవసాయ రుణాలు, నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వ్యవసాయ ఉత్పత్తుల దిగుమతుల విషయంలో దేశీయ రైతుల ప్రయోజనాలను ప్రథమ ప్రాధాన్యంగా పరిగణించాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ సంస్థలకు అప్పగించే విధానాలకు వ్యతిరేకంగా రైతులు, వ్యవసాయ కార్మికులు, ప్రజలు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. రైతాంగ సమస్యలపై నిరంతర అధ్యయనం, ప్రజల్లో అవగాహన, ఉద్యమ నిర్మాణం ద్వారానే ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకురాగలమని పేర్కొన్నారు.

అనంతరం సీపీఐ(ఎం) వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం మాట్లాడుతూ కామ్రేడ్ నర్వనేని సత్యనారాయణ జీవితాంతం ప్రజా సమస్యలపై అధ్యయనం చేస్తూ, తాను తెలుసుకున్న విషయాలను ప్రజా ఉద్యమాలకు అనుసంధానం చేసిన అధ్యయనశీలి, ఆచరణవాదని గుర్తుచేశారు. ఆయన ఆలోచనా విధానాన్ని స్ఫూర్తిగా తీసుకుని నేటి సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిణామాలపై అధ్యయనం చేసి ప్రజలను చైతన్యపరచాల్సిన బాధ్యత కమ్యూనిస్టు ఉద్యమంపై ఉందన్నారు. రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలు కేవలం రైతుల సమస్యలు కాదని, అవి దేశ ఆహార భద్రతకు, గ్రామీణ ప్రజల జీవనానికి, మొత్తం సమాజ ఆర్థిక వ్యవస్థకు సంబంధించినవని తెలిపారు. అందువల్ల వ్యవసాయ రంగాన్ని రక్షించేందుకు విస్తృత ప్రజా ఉద్యమాలను నిర్మించాలని పిలుపునిచ్చారు. తొలుత నర్వనేని సత్యనారాయణ స్మారక స్థూపం వద్ద పార్టీ జెండాను జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు ఆవిష్కరించారు. రిటైర్డ్ ప్రొఫెసర్ ఆరిబండి ప్రసాదరావు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పార్టీ వైరా రూరల్ మండల కార్యదర్శి బాణాల శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సభలో నర్వనేని సత్యనారాయణ చిత్రపటానికి నర్వనేని కృష్ణయ్య పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బొంతు రాంబాబు, జిల్లా కమిటీ సభ్యులు తాళ్ళపల్లి కృష్ణ, సుంకర సుధాకర్, డివిజన్ కార్యదర్శివర్గ సభ్యులు మచ్చా మణి, తోట నాగేశ్వరరావు, తూము సుధాకర్, కుందనపు నరేంద్ర, నర్వనేని సత్యనారాయణ భార్యా నర్వనేని పద్మావతి, కుమారులు వెంకటరావు, శ్రీనివాసరావు, పార్టీ మండల కమిటీ సభ్యులు, శాఖ కార్యదర్శులు, పార్టీ సభ్యులు, సానుభూతిపరులు, కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు, వందల సంఖ్యలో రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

## SVBC ఛైర్మన్‌గా శ్రీధర్ వర్మ నియామకం

**ముద్ర, తిరుపతి :** తిరుపతి శ్రీ వేంకటేశ్వర భక్తి ఛానల్ (SVBC) ఛైర్మన్‌గా ఎన్టీఆర్ రాజు కుమారుడు శ్రీధర్ వర్మ నియమితు లయ్యారు. జిల్లా తెలుగు యువత అధ్యక్షుడి గా, స్టేట్ మీడియా కో–ఆర్డినేటర్‌గా ఆయన పనిచేశారు. ఆయన తండ్రి ఎన్టీఆర్ రాజు టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీలో సీనియర్‌గా కొనసాగుతూ, టీటీడీ పాలక మండలి సభ్యుడిగానూ పనిచేశారు. పార్టీకి విధేయుడిగా ఉన్న శ్రీధర్ వర్మ ఈ నెల 22న SVBC ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించ నున్నారు.

## నేను కూడా సైబర్ చీటర్ల బాధితుడినే..!

**- నాలుగేళ్ల క్రితం బ్యాంకు ఆఫీసర్ పేరుతో చీటర్లు ట్రాప్ చేసారు.!**
**- నాగార్జున అక్కినేని**

**ముద్ర, హైదరాబాద్ :** ఆ మధ్య తమ కుటుంబంలో ఒకరు డిజిటల్ అరెస్ట్ కు గురయ్యారు అంటూ వెల్లడించిన నాగార్జున తాజాగా ఈరోజు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో నిర్వహిస్తున్న కార్యక్రమంలో పాల్గొన్నారు.. ఈ సందర్భంగా మాట్లాడుతూ తనను కూడా సైబర్ కేటుగాళ్లు ఫోన్ బ్యాంక్ అధికారులం అంటూ నమ్మించి మోసం చేసారని.. నాలుగేళ్ల క్రితం ఈ ఘటన జరిగిందని చెప్పుకొచ్చారు..!




# సెప్టెంబర్ మొదటివారంలో పనులు మొదలు కావాల్సిందే

*** ఆగస్టు చివరి నాటికి టెండర్ ప్రక్రియ పూర్తి చేయాల్సిందే**
*** నాణ్యతలో రాజీ పడొద్దు... ఏర్పాట్లలో శాఖల మధ్య సమన్వయం తప్పనిసరి**
*** 'గోదావరి పుష్కరాలు – 2027' కేబినెట్ సబ్ కమిటీ సమావేశంలో అధికారులకు మంత్రి శ్రీధర్ బాబు ఆదేశాలు**



**ముద్ర, హైదరాబాద్ :** 'గోదావరి పుష్కరాలు–2027' నిర్వహణను రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుందని, ఎట్టి పరిస్థితుల్లోనూ సెప్టెంబర్ మొదటి వారంలో పనులను ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆదేశించారు. ఆ మేరకు టెండర్ ప్రక్రియను ఆగస్టు చివరి నాటికి పూర్తి చేయాలని స్పష్టం చేశారు. డా.బీ.ఆర్. అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో ఆయన అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన 'గోదావరి పుష్కరాలు – 2027' కేబినెట్ సబ్ కమిటీ సమావేశంలో మంత్రులు కొండా సురేఖ, తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, సీతక్క, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, వివేక్ వెంకటస్వామి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా...కమిటీ సభ్యులు శాఖలవారీగా సన్నద్ధత, ఏర్పాట్ల పురోగతిని ప్రత్యేకంగా సమీక్షించి అధికారులకు దిశానిర్దేశం చేశారు. అనంతరం కేబినెట్ సబ్ కమిటీ ఛైర్మన్ మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... గోదావరి పుష్కరాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.వేయి కోట్లు కేటాయించిందన్నారు. భక్తుల రద్దీ అధికంగా ఉండే టైర్–1 ప్రాంతాలకు ప్రత్యేకంగా స్పెషల్ ఆఫీసర్లను నియమించాలని ఆదేశించారు. అలాగే ముఖ్యమైన ప్రాంతాల్లో... ప్రత్యేకంగా కమాండ్ కంట్రోల్ సెంటర్లను ఏర్పాటు చేయాలని సూచించారు. నిర్దేశిత గడువులోగా పనులు పూర్తయ్యేలా సంబంధిత శాఖ ఉన్నతాధికారులు తీసుకోవాలని స్పష్టం చేశారు. అలా అని... నాణ్యతలో రాజీ పడొద్దని, పనుల పురోగతిని పర్యవేక్షించేందుకు సంబంధిత అధికారులు నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటించాలని స్పష్టం చేశారు. వర్క్ ప్రోగ్రెస్ ను రోజువారీగా తెలుసుకునేలా ప్రత్యేక డ్యాష్‌బోర్డును అందుబాటులోకి తేవాలని దేవాదాయ శాఖ అధికారులకు సూచించారు. అన్ని శాఖలు సమష్టిగా పని చేస్తేనే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పుష్కరాలు విజయ వంతం అవుతాయన్నారు. శాఖల మధ్య సమన్వయం లోపం తలెత్తకుండా సంబంధిత ఉన్నతాధికారులు ప్రత్యేకంగా చొరవ తీసుకోవాలన్నారు. పుష్కరాలకు వచ్చే భక్తులకు రవాణా పరంగా ఎలాంటి అంతరాయం కలగకుండా ప్రతి రోడ్డును అనుసంధానించాలన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, కలెక్టర్లు, ఎస్పీలు, ఇతర జిల్లా ఉన్నతాధికారులు, పండితులను పుష్కర ఏర్పాట్లలో తప్పనిసరిగా భాగస్వామ్యం చేయాలన్నారు. భక్తులకు సేవలు అందించేందుకు ముందుకొచ్చే స్వచ్ఛంద, ప్రైవేట్ సంస్థలను ముందుగానే గుర్తించాలని మంత్రి శ్రీధర్ బాబు సూచించారు. కేబినెట్ సబ్ కమిటీ సభ్యుల సలహాలు, సూచనలను తప్పనిసరిగా పరిగణనలోకి తీసుకుని... అందుకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టం చేశారు. పుష్కర ఏర్పాట్లలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

# అధునాతన అగ్నిమాపక వాహనాలు..

**- ప్రారంభించిన సీఎం చంద్రబాబు**



**ముద్ర, అమరావతి :** రాష్ట్ర అగ్నిమాపకశాఖలోకి మరికొన్ని ఆధునిక వాహనాలు రానున్నాయి. తాజాగా 58 ఆధునిక ఫైర్‌ఫైటింగ్ వాహనాలను ముఖ్యమంత్రి చంద్రబాబు జెండా ఊపి ప్రారంభించారు. 25 అధునాతన ఫైర్ ఫైటింగ్ వాహనాలు.. 20 వాటర్ బౌజర్లు.. 13 క్విక్ రెస్పాన్స్ మల్టీపర్పస్ ఫైర్‌ఫైటింగ్ వాహనాలను లాంచ్ చేశారు. గ్రామీణ, అటవీ ప్రాంతాల్లో అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేలా 25 అధునాతన ఫైర్‌ఫైటింగ్ వాహనాలను అగ్నిమాపక శాఖ సమకూర్చుకుంది. భారీ అగ్నిప్రమాదాల్లో మంటలను అదుపు చేయడానికి అవసరమయ్యే నిరంతర నీటి సరఫరాకు 20 వాటర్ బౌజర్లు కొనుగోలు చేసింది. ఇరుకైన, రద్దీ ప్రాంతాల్లోకి వేగంగా చేరుకునేలా 13 క్విక్ రెస్పాన్స్ మల్టీపర్పస్ ఫైర్‌ఫైటింగ్ వాహనాలు పనిచేస్తాయి. తొలి దశలో ఇప్పటికే రూ.33 కోట్లతో 65 ఫైర్‌ఫైటింగ్ వాహనాలను ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. వాహనాల ప్రత్యేకతలను అధికారులు సీఎంకు వివరించారు. కార్యక్రమంలో హోంమంత్రి అనిత, అగ్నిమాపక శాఖ డీజీ వెంకట రమణ, అధికారులు పాల్గొన్నారు.

## విద్యతో పాటు సాంకేతిక నైపుణ్యంలో శిక్షణ ఇస్తున్నాం

**- సీఎం రేవంత్**



**ముద్ర, హైదరాబాద్ :** ప్రజాపాలనలో మహాత్మా జ్యోతిబా పులే విధానాలను కొనసాగిస్తున్నామని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. చదువుతో తలరాత మారి.. సమాజంలో గుర్తింపు లభిస్తుందని చెప్పారు. అన్ని వర్గాలు ఒకే చోట చదువు, జీవించడం ద్వారా కులవ్యవస్థ నిర్మూలన సాధ్యమవుతుందన్నారు. హెచ్ఎండీఏ గ్రౌండ్స్‌లో బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జ్యోతిబా పులే, సావిత్రిబాయి పులే దంపతుల విగ్రహాలను సీఎం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో విద్యార్థులు, యువతను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. విద్యా వ్యవస్థను ప్రక్షాళన చేసి నాణ్యమైన విద్య అందిస్తున్నామని సీఎం రేవంత్ అన్నారు. యంగ్ ఇండియా స్కూళ్ల ద్వారా విప్లవాత్మక మార్పు తీసుకొచ్చామని చెప్పారు. "ఏటా రూ.2,400 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను ముందే జమ చేస్తున్నాం. ఈ ఏడాది నుంచే దీన్ని అమల్లోకి తెచ్చాం. కళాశాలల్లో ప్రవేశాలు పొందాక ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేస్తే నెల రోజుల్లో ఫీజు జమ అవుతుంది. సాంకేతిక నైపుణ్యం ఉన్నవారికే ప్రపంచం ఎర్ర తివాచీతో స్వాగతం పలుకుతోంది. అలాంటి వారికి జర్మనీ, జపాన్, దక్షిణ కొరియాలో ఉద్యోగాలు ఉన్నాయి. ఏఐ వల్ల ఐటీ నిపుణుల ఉద్యోగాలు పోయే పరిస్థితి వచ్చింది. ఈ సంక్షోభాన్ని ఎలా ఎదుర్కోవాలో అందరూ ఆలోచించాలి. అందుకే విద్యతో పాటు సాంకేతిక నైపుణ్యం నేర్పిస్తున్నాం. సాంకేతిక నైపుణ్యం సాధించిన వారికి జర్మనీ, జపాన్, దక్షిణ కొరియా పంపిస్తాం. ఒలింపిక్స్‌లో మెడల్స్ సాధిస్తే ప్రభుత్వ ఉద్యోగం, నజరానాలు అందిస్తాం''అని సీఎం అన్నారు.

## 1116 చీరలతో నిమిషాంబిక అమ్మవారి అలంకరణ

**- శ్రావణ తొలి శుక్రవారం ఆలయం భక్తులతో కిటకిట**



**ముద్ర, బోడుప్పల్:** శ్రావణ మాసం మొదటి శుక్రవారం సందర్భంగా శ్రీ మాతా నిమిషాంబ దేవి దేవాలయం శ్రావణ లక్ష్మీశోభ తో నెలకొన్నది. 1116 చీరల విశేష అలంకరణలో అమ్మవారు దేదిప్య మానంగా వెలుగు దివ్వెల కాంతుల తో ఉజ్జ్వలంగా ప్రకాశిస్తూ దర్శన భాగ్యం కల్పిస్తున్నారు. తెల్లవారుజా ము నుంచే భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ పరిసరా లు నిమిషాంబనామ స్మరణతో శ్రీ మాత్రే నమః స్మరణతో మార్మోగా యి. మధ్యాహ్నం భక్తులందరికీ అన్నదానం చేయడం జరిగింది. ఆలయ చైర్మన్ కామరౌతు వినోద్ కుమార్, సెట్లర్ కళావతి, ప్రధాన కార్యదర్శులు కె. అశోక్ కుమార్, సంగు శ్రీనివాస్, కోశాధికారి ఎన్.రమేష్ , రాష్ట్ర నకాష్ సంఘం ప్రధాన కార్యదర్శి కొరిచెర్ల శ్రీనివాస్ రావు ఆలయంలో భక్తులకు సౌకర్యాలు కల్పించారు. ఆలయ ట్రస్ట్ ధర్మకర్తలు బి. హిమచందర్, వై. చంద్రశేఖర్, ఎస్. గౌరి శంకర్, డి. నర్సింగ్ రావు, ఎమ్. శ్రీనివాస్ రావు, ఎమ్. సాయి బాబా (శ్యామ్), డి. సతీష్, రామగిరి శ్రీకాంత్, ఎన్. శ్రీకాంత్, ఎన్ . రామకృష్ణ, ఎన్. మోహన్, డి. రామక్రిష్ణ, ఎన్. శ్రీధర్, వెంకట్ రాజారావు, కె. ప్రవీణ్ కుమార్, డి. నరేష్, వై. సత్యనారాయణ పాల్గొన్నారు. ఆలయ ప్రధాన అర్చకులు చంద్రశేఖర్ శర్మ, అర్చకుడు ఉమాకాంత్ శర్మ పాల్గొన్నారు.

## బ్యాండ్ బాజాలతో అదరగొట్టిన మహిళా పోలీసులు

**మహిళా పోలీసుల ప్రతిభకు వేదిక.. ఆల్-విమెన్ పోలీస్ బ్యాండ్ ప్రారంభం**




**ముద్ర, హైదరాబాద్ బ్యూరో ::** తెలంగాణ రాష్ట్రంలోనే తొలిసారి గా మహిళా పోలీసులతో కూడిన ఆల్–విమెన్ పోలీస్ బ్యాండ్‌ను మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ పరిధిలోని నేరేడ్‌మెట్ కమిష నరేట్ కార్యాలయంలో శుక్రవా రం ప్రారంభించారు. పోలీస్ కమిషనర్ బి. సుమతి, ఐపీఎస్ ఈ ప్రత్యేక మహిళా పోలీస్ బ్యాండ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మహిళా పోలీసు సిబ్బంది నిర్వహించిన బ్యాండ్ ప్రదర్శన ఆక ట్టుకుంది. పోలీసు శాఖలో మహిళల ప్రతిభ, నైపుణ్యం, క్రమశిక్షణ, అంకితభావాన్ని చాటిచెప్పేలా ఈ ప్రత్యేక బ్యాండ్‌ను ఏర్పాటు చేశారు. తెలంగాణలోనే తొలిసారిగా మహిళా పోలీసులతో ఆల్–విమెన్ పోలీస్ బ్యాండ్‌ను ఏర్పాటు చేయడం విశేషంగా నిలిచింది. కాగా ఇదే కార్యక్రమంలో 2026 సంవత్సరానికి పోలీసు పతకాలు అందుకున్న సిబ్బందిని వారి విశిష్ట సేవలు, అంకితభావానికి గుర్తింపుగా ఘనంగా సన్మానించారు. పోలీసు విధుల్లో అత్యుత్తమ సేవలు అందించిన సిబ్బందిని కమిషనర్ బి. సుమతి అభినందించారు. మహిళా పోలీసుల ప్రతిభకు ప్రత్యేక వేదిక కల్పించడంతో పాటు, వారి సేవా నిబద్ధతను మరింత ప్రోత్సహించేలా ఆల్–విమెన్ పోలీస్ బ్యాండ్ ఏర్పాటు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది.

## దేశవ్యాప్తంగా దంచికొడుతున్న వర్షాలు..

**పలు రాష్ట్రాల్లో వరద బీభత్సం**

**ముద్ర, హైదరాబాద్ :** దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో భారీ వర్షాలు దంచికొడుతున్నాయి. ఒడిశాలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో పలు ప్రాంతాలు వరద నీటిలో చిక్కుకున్నాయి. ముఖ్యంగా మయూర్‌భంజ్ జిల్లాలో గత 24 గంటలుగా కురుస్తున్న భారీ వర్షాలతో జనజీవనం తీవ్రంగా ప్రభావితమైంది. ఉత్తర ఒడిశాలోని పలు జిల్లాల్లో వరద పరిస్థితులు నెలకొన్నట్లు తాజా నివేదికలు వెల్లడిస్తున్నాయి.ఇక జమ్మూ కశ్మీర్‌లోని భదర్వా ప్రాంతంలో వడగండ్లతో కూడిన భారీ వర్షం కురిసింది. ఆకస్మిక వర్షాల కారణంగా కొండచరియలు విరిగిపడి శ్రీనగర్–లేహ్ హైవేపై రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దీంతో ప్రయాణికులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. హిమాచల్‌ప్రదేశ్‌లోనూ వర్షాలు బీభత్సం సృష్టిస్తున్నాయి. ధర్మశాలతో పాటు పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తుండటంతో జనజీవనం స్తంభించింది. రాష్ట్రంలో మరికొన్ని రోజుల పాటు భారీ వర్షాలు కొనసాగే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
www.mudranews.in
@mudranews
mudratv
శనివారం 15.08.2026
4 వేదిక Peoples Voice
మీ 'ముద్ర' వేయండి

నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు 'దాశరథి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి'.. పాటలతో ఉద్యమాన్ని రగిలించిన నేల ఇదీ.. తెలంగాణ రక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేల పుట్టినిల్లు.. అందుకే మీలోని రచయితను మేల్కొలపండి.. కవితలు, వ్యాసాలు, సంపాదకీయాలు ఏవైనా సరే.. మేం ప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్ గా మీ భావాలను వ్యక్తీకరించండి..

మీ రచనలు పంపాల్సిన వాట్సాప్ నం.: +91 98496 23744
అలాగే ఈ-మెయిల్ కూడా చేయొచ్చు: mudradaily@gmail.com

# శ్రావణ మాసం పవిత్రం

హిందూ క్యాలెండర్ ప్రకారం.. శ్రావణమాసంను ఆధ్యాత్మిక మాసంగా పేర్కొంటారు. ఈ మాసంలో ముఖ్యంగా శివారాధన ఎక్కువగా ఉంటుంది. సోమవారాల్లో వివిధ వ్రతాలు, పూజలు, అభిషేకాలు నిర్వహిస్తూ భక్తులు శివుడిని ఆరాధిస్తారు. అసలు శ్రావణమాసంలో శివుడి ఆరాధన ఎందుకు?

శ్రావణ మాసం మొత్తం శివుడికి అంకితమైన కాలంగా అనేక హిందూ సంప్రదాయాలు భావిస్తాయి. ముఖ్యంగా సోమవారం శివుడికి ప్రీతికరమైన రోజుగా పరిగణిస్తారు. అందుకే శ్రావణ సోమవారాల్లో ఉపవాసం ఉండటం, శివుడికి ప్రత్యేక పూజలు చేయడం ఆనవాయితీగా వస్తోంది. ఈ రోజున కొందరు వ్రతం కూడా చేస్తుంటారు.

శ్రావణ మాసానికి సంబంధించిన శైవ సంప్రదాయాల్లో సముద్ర మథనం కథకు ప్రత్యేక స్థానం ఉంది. పురాణ కథనం ప్రకారం దేవతలు, అసురులు అమృతం కోసం సముద్రాన్ని మథించినప్పుడు హాలాహల విషం వెలువడింది. ఆ విషం సృష్టిని నాశనం చేయకుండా శివుడు దానిని స్వీకరించాడని కథనం. విషాన్ని కంఠంలో నిలిపినందుకు శివుడిని 'నీలకంఠుడు'గా పిలుస్తారు. ఈ పురాణ గాథను స్మరించుకుంటూ శ్రావణంలో శివారాధన చేయడం వల్ల విశేష ఫలితాలు ఉంటాయని చెబుతున్నారు.

శ్రావణంలో శివలింగానికి నీరు, పాలు, పెరుగు, తేనె వంటి ద్రవ్యాలతో అభిషేకం చేయడం కనిపిస్తుంది. అయితే దీని వెనుక ఉన్న ప్రధాన ఆధ్యాత్మిక భావం శరణాగతి, పవిత్రత, మనస్సును ప్రశాంతంగా ఉంచుకోవడం. ముఖ్యంగా నిరంతరం జలధార తో శివలింగానికి అభిషేకం చేయడం తనలోని అహంకారం, కోపం, ద్వేషం వంటి భావాలను విడిచిపెట్టి ప్రశాంతతను కోరుకోవడాన్ని ప్రతీకాత్మకంగా భావించవచ్చు.



శ్రావణం సాధారణంగా వర్షాకాలంతో ముడిపడి ఉంటుంది. వర్షాలతో భూమి పచ్చగా మారుతుంది, చెరువులు, వాగులు నీటితో నిండుతాయి, వ్యవసాయ పనులు ఊపందుకుంటాయి. అందువల్ల శ్రావణ కాలంలో ప్రకృతిని దైవ స్వరూపంగా చూడటం, ప్రకృతికి కృతజ్ఞత చెప్పడం వంటి భావనలు సంప్రదాయాల్లో కనిపిస్తాయి. వర్షాలు, పంటలు, నీరు, పచ్చదనం మనిషి జీవనానికి ఎంత ముఖ్యమో గుర్తుచేసే కాలంగా కూడా ఈ మాసాన్ని చూడవ చ్చు.

# పాక్ స్వాతంత్ర్య దినం మతలబు

పాకిస్తాన్‌కి స్వాతంత్రం ఎప్పుడు వచ్చిందని ఎవరినడిగినా 1947, ఆగస్టు 14 అని టక్కున సమాధానం చెబుతారు . కానీ అది సరైంది కాదు. పాకిస్తాన్‌కు అధికార బదిలీ జరిగింది, స్వాతంత్రం లభించింది కూడా ఆగస్టు 15నే. మరి ఆదేశం ఆగస్టు 14న స్వాతంత్ర దినోత్సవం జరుపుకుంటుంది కదా అని మీరడగవచ్చు. అలా జరుపుకోవటం వెనుక కొన్ని కారణాలున్నాయి.

మొదటి నుండి చూద్దాం. చట్టపరంగా అధికారికంగా పాకిస్తాన్‌కు కూడా అధికార బదిలీ జరిగింది ఆగస్టు 14–15 మధ్య అర్ధరాత్రినే. బ్రిటిష్ ఇండియా రెండు దేశాలుగా అంటే ఇండియా, పాకిస్తాన్‌గా విభజన జరిగింది 1947, ఆగస్టు 14 అర్ధరాత్రి దాటాక 15వ తేదీ ప్రారంభ సమయంలో. ఈ అధికార బదిలీ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు ఇటు ఢిల్లీలో అటు పాకిస్తాన్ రాజధాని కరాచీలో జరుగుతాయి. కాని ఒకేసారి ఈ రెండు చోట్ల ఉండటం అక్కడి వేడుకల్లో పాల్గొనడం గవర్నర్ జనరల్ మౌంట్ బాటన్ కు సాధ్యం కాని పని. అందుకని ఆయన ఆగస్టు 13వ తేదీ రాత్రి కరాచీ చేరుకుంటాడు 14వ తేదీ ఉదయం పాకిస్తాన్ రాజ్యాంగ నిర్మాణ సభలో ప్రసంగిస్తూ పాకిస్తాన్ కు మరుసటి రోజున అనగా ఆగస్టు 15వ తేదీన అధికార బదిలీ జరుగుతుందని ప్రకటిస్తాడు. అనంతరం ఢిల్లీ వెళ్ళిపోతాడు. ఆగస్టు 15వ తేదీ అర్ధరాత్రి భారత రాజ్యాంగ నిర్మాణ పరిషత్ లో మౌంట్ బాటన్ ప్రసంగించాక సరిగ్గా 12 గంటలకు బ్రిటిష్ ఇండియా ఇండిపెండెన్స్ యాక్ట్ ప్రకారం ఇండియా, పాకిస్తాన్ లకు అధికార బదిలీ జరిగి రెండింటికీ డొమినియన్ హోదా వస్తుంది .

అయితే టైం జోన్ ( కాల మండలి ) ప్రకారం ఇండియాలో అర్ధరాత్రి 12 గంటలైతే పాకిస్తాన్‌లో అర్ధరాత్రి గం 11–30. ఇక్కడ కొత్త ఢిల్లీలో 12 గంటల ఒక్క నిమిషానికి నెహ్రూ తన ట్రిస్ట్ విత్ డెస్టినీ అనే చారిత్రక ప్రసంగం చేస్తాడు. అక్కడ పాకిస్తాన్లో ముందుగానే రికార్డు చేసిన మహమ్మద్ అలీ జిన్నా ప్రసంగాన్ని ఆ రాత్రి 11 గంటల 31 నిమిషాలకు లాహోర్ రేడియో ద్వారా ప్రసారం చేస్తారు. ఇక్కడొక విచిత్రం జరిగింది. ఏమిటంటే ఆ ప్రసంగం 'మన స్వతంత్ర సార్వభౌమిక పాకిస్తాన్ జన్మదినం ఆగస్టు 15' అని మొదలవుతుంది. అంతా అవాక్కవుతారు. ఇది ఎలానంటే ఆగస్టు 15 న పాకిస్తాన్ డొమినియన్ కు అధికార బదిలీ జరుగుతుందని ముందుగానే ప్రకటించారు. కాబట్టి ఆ మేరకు జిన్నా ప్రసంగాన్ని కూడా అలానే రికార్డు చేసి ఉంచారు. ఆ ప్రసంగం అలా ఉన్నప్పటికీ ఇరు దేశాలకు అధికార బదిలీ ఆగస్టు 15న అర్ధరాత్రి న్యూఢిల్లీలో జరిగినప్పటికీ టైం జోన్ ప్రకారం ఆ సమయం పాకిస్థాన్లో ఆగస్టు 14 అర్ధరాత్రి 11:30 గంటలు. ఇక్కడ మరొక విషయం ఉంది. ఈ ఆగస్టు 14 ఆ సంవత్సరపు పవిత్ర రంజాన్ మాసంలో 27వ రోజు (రమదాన్ 1366 హిజ్రీ). ఈ 27వ రోజును ముస్లింలు చాలా పవిత్రంగా భావిస్తారు. దీంతో ఈ ఆగస్టు 14 రాత్రిని పాకిస్థానీయులు అధికారపు రాత్రి (లేలత్ అల్ ఖదర్)గా కూడా పరిగణిస్తున్నారు. అధికార బదిలి, స్వాతంత్ర ప్రకటన న్యూఢిల్లీలో ఆగస్టు 14వ అర్ధరాత్రి 12 గంటలకు జరిగినప్పటికీ పాకిస్తాన్ కాలమానం ప్రకారమైతేనేమి ఈ పవిత్ర 27వ రోజు వలనైతేనేమి, పాక్ ప్రజలు ఆగస్టు 14 నే స్వాతంత్రదినంగా పరిగణిస్తున్నారు. కానీ స్వాతంత్ర దినోత్సవ సెలవు మాత్రం ఆగస్టు 15వ తేదీన ఉంది. మరి దీనిని ఎలా అధిగమించాలి.

దీనికి పాకిస్తాన్ ప్రభుత్వం ఒక పరిష్కారం కనుగొన్నది. పైన చెప్పుకున్నట్టు బ్రిటిష్ ఇండియా ఇండిపెండెంట్ యాక్ట్ ప్రకారం ఇండియా పాకిస్తాన్ లకు లాంఛనంగా అధికార బదిలీ జరిపి డోమినియన్ హోదా ఇచ్చింది ఆగస్టు 15న. కానీ ఏడాది తర్వాత పాకిస్తాన్ ప్రభుత్వం స్వాతంత్ర సెలవు దినాన్ని శాశ్వతంగా ఒకరోజు ముందుకు అనగా ఆగస్టు 14 కు జరుపుకున్నది. ఈ మేరకు 1988 జూన్‌లో కరాచీలో పాకిస్తాన్ ప్రధానమంత్రి లియాఖత్ అలీ ఖాన్ అధ్యక్షతన మంత్రివర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కొందరు మంత్రులు పాకిస్తాన్ స్వాతంత్ర దినాన్ని శాశ్వతంగా ఆగస్టు 14 ను చేయాలని ఒక తీర్మానాన్ని మంత్రివర్గం ముందు పెట్టారు. దీనికి వారు మూడు కారణాలు చూపారు. 1) ఇంగ్లీష్ క్యాలెండర్‌లోని ఆగస్టు 15నే ఇండియాలా మనమూ స్వాతంత్ర దినోత్సవం జరుపుకోకుండా మనకూ ప్రత్యేకంగా ఒక రోజు ఉండాలి. 2) అధికార బదిలీ ప్రకటనను మౌంట్ బాటన్ ఆగస్టు 14న పాకిస్తాన్ రాజ్యాంగ నిర్మాణ సభలో ప్రకటించటం. 3) ఆగస్టు 14 రంజాన్ మాసంలోని పవిత్రమైన 27 వ రోజు కావటం. ఈ కారణాలతో కూడిన ఆ ప్రతిపాదనను మంత్రివర్గం అంగీకరించి తుది ఆమోదం కోసం అధ్యక్షుడు మహమ్మద్ అలీ జిన్నాకు సిఫారసు చేశారు. దీంతో పాకిస్తాన్ స్వాతంత్ర దినాన్ని శాశ్వతంగా ఆగస్టు 14 ను చేస్తూ జిన్నా ఆమోదించారు. ఇక అప్పటి నుండి పాకిస్తాన్ స్వాతంత్ర దినం ఆగస్టు 14 గా స్థిరపడింది. అంటే పాకిస్థాన్ మొదటి స్వాతంత్ర దినం ఆగస్ట్ 15 న జరగ్గా 1948 లో రెండవ స్వాతంత్ర దినం నుండి ఆగస్టు 14నే అసలు స్వాతంత్ర దినోత్సవంగా స్థిరపడి ఆరోజే పాక్ ప్రజల స్వాతంత్ర దినోత్సవ వేడుకలు జరుగుతూ వస్తున్నాయి. పాకిస్థాన్ పాఠ్యపుస్తకాలలో కూడా 'ఆగస్టు 14 ఒక తేదీ మాత్రమే కాదు. మహానేత జిన్నా మనకు స్వంత దేశాన్ని ఇచ్చిన రోజు' అని ముదరించుకున్నారు. ఇదీ పాక్ స్వాతంత్ర దినోత్సవ కథా కమామిషు.






కేఎస్ఎన్ ప్రసాద్
9492522089

# వాకింగ్ చేస్తే మోకాళ్లు అరుగుతాయా?

ప్రస్తుత కాలంలో ప్రతిరోజూ వ్యాయామం చేయడం తప్పనిసరిగా మారింది. ఇది వీలుకాకపోతే కనీసం వాకింగ్ అయినా చేయాలి అని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. అయితే ప్రతిరోజూ వాకింగ్ చేయడం వల్ల మోకాళ్లు అరిగిపోతాయని కొందరు భయపడుతున్నారు. కానీ క్రమబద్ధమైన శారీరక శ్రమ కీళ్ల ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని, అవి అరిగిపోవని వైద్యులు అంటున్నారు. ఇంతకీ వాకింగ్ చేయడం వల్ల సమస్యలు ఉంటాయా?

కొందరు ప్రముఖ వైద్యులు తెలుపుతన్న ప్ర



కారం.. కీళ్లను బలంగా, ఆరోగ్యంగా ఉంచడంలో కండరాల బలం, సరైన శరీర బరువు నిర్వహణ అత్యంత కీలక పాత్ర పోషిస్తాయి. వ్యాయామం చేయడం వల్ల మోకాళ్ల చుట్టూ ఉండే కండరాలు బలపడి, కీళ్లపై పడే ఒత్తిడిని తగ్గిస్తాయి. అలాగే, శరీరం అధిక బరువు ఉన్నప్పుడు కీళ్లపై విపరీతమైన భారం పడి అరిగిపోయే ప్రమాదం పెరుగుతుంది. కాబట్టి బరువును నియంత్రణలో ఉంచుకోవడమే కీళ్ల రక్షణకు అసలైన మార్గం. ఈ కీళ్ల రక్షణకు వాకింగ్ సరైనదే అని అంటున్నారు.

కీళ్ల నొప్పులతో బాధపడుతున్నవారు వ్యాయామాలకు పూర్తిగా దూరంగా ఉండకూడదని వైద్యులు సూచిస్తున్నారు. నొప్పులు ఉన్నప్పటికీ వైద్యుల సలహాతో తేలికపాటి వ్యాయామాలు, స్విమ్మింగ్ లేదా వాకింగ్ వంటి తక్కువ ఒత్తిడినిచ్చే పనులు కొనసాగించడం మంచివని అంటున్నారు. వ్యా యామం పూర్తిగా ఆపివేస్తే కీళ్లు మరింత బిగుసుకుపోయి, సమస్య తీవ్రమయ్యే అవకాశం ఉంది.

చాలామంది కాల్షియం, విటమిన్–డి సప్లిమెంట్లు వాడితే కీళ్లవాతం రాకుండా అడ్డుకోవచ్చని భావిస్తుంటారు. అయితే ఈ సప్లిమెంట్లు కీళ్ల వాతాన్ని నివారించలేవని ఆయన స్పష్టం చేశారు. ఎముకల సాంద్రతకు ఇవి తోడ్పడినప్పటికీ, కీళ్లను ఆరోగ్యంగా ఉంచడానికి క్రమబద్ధమైన వ్యాయామం, సరైన జీవనశైలి మాత్రమే నిజమైన పరిష్కారాలని ఆయన స్పష్టం చేస్తున్నారు.

# చెడ్డ వారితో స్నేహం, మంచివారితో విరోధం ఏది బెటర్




కొందరు పెద్దలు చెబుతూ ఉంటారు.. 'చెడ్డ వారితో స్నేహం చేయడం కంటే.. మంచి వారితో విరోధం ఉండటం మేలు' అని. మనం ఎవరితో కలిసి ఉంటామో, ఎవరిని ప్రత్యర్థిగా భావిస్తామో కూడా మన జీవితంపై ప్రభావం చూపుతుంది. దీనికి ఉదాహరణగా మహాభారతంలోని దుర్యోధనుడి పరిపాలనకు సంబంధించిన ఓ ఆసక్తికరమైన కథ ఆధారంగా తెలుసుకోవచ్చు. ఈ స్టోరీ నేటి కాలంలోని వారికి కూడా ఉపయోగపడే అవకాశాలున్నాయి.

కౌరవులు, పాండవుల మధ్య జరిగిన పరిణామాల నేపథ్యంలో పాండవులు వనవాసానికి వెళ్లాల్సి వచ్చింది. దీంతో హస్తినాపురంలో దుర్యోధనుడి ఆధిపత్యం కొనసాగింది. రాజ్యం తన చేతుల్లోకి రావడంతో దుర్యోధనుడు ఎలా పరిపాలిస్తున్నాడు? ప్రజలు సంతోషంగా ఉన్నారా? రాజ్యంలో పరిస్థితులు ఎలా ఉన్నాయి? అనే విషయాలను ధర్మరాజు తెలుసుకోవాలనుకున్నాడు. ధర్మ రాజు తనకు సన్నిహితంగా ఉన్న ఓ వ్యక్తిని రాజ్యంలోకి వెళ్లి పరిస్థితులను తెలుసుకురావాలని కోరాడు. ఆ వ్యక్తి సాధారణ వ్యక్తిలా రాజ్యంలో తిరుగుతూ ప్రజలను కలుసుకున్నాడు. పాలన ఎలా ఉంది? ప్రజలకు ఎలాంటి ఇబ్బందులున్నాయి? అధికారులు ఎలా పనిచేస్తున్నారు? అనే అంశాలపై 6 నెలలు వివరాలు సేకరించాడు.

ఆరు నెలల తరువాత తిరిగి వచ్చిన ఆ వ్యక్తి ధర్మరాజును కలిశాడు. తాను చెప్పబోయే విషయం విని కోపం తెచ్చుకోవద్దని ముందుగానే కోరాడు. అనంతరం దుర్యోధనుడి పాలన గురించి ధర్మరాజుకు ఊహించని విషయాన్ని చెప్పాడు. దుర్యోధనుడు రాజ్యాన్ని బాగానే పరిపాలిస్తున్నాడని తెలిపాడు. ఈ మాట విన్న ధర్మరాజు ఆశ్చర్యపోయాడు. దుర్యోధనుడికి వంకర బుద్ధి ఉందని, తమపై ఎప్పుడూ ద్వేషంతో ఉంటాడని తెలిసినప్పటికీ.. అతని పాలన ఎలా మంచిగా ఉందని అడిగాడు.

అప్పుడు ఆ వ్యక్తి అసలు విషయాన్ని వివరించాడు. 'దుర్యోధనుడి ఆలోచనా విధానం ఎలా ఉన్నా.. అతను మీ కంటే మెరుగ్గా పరిపాలించాలని ప్రయత్నిస్తున్నాడు. అందుకు ప్రధాన కారణం మీరే ' అని చెప్పాడు. ధర్మరాజు తన పాలనలో న్యాయం, ధర్మానికి ప్రాధాన్యం ఇచ్చేవాడు. ప్రజలను సంతోషంగా ఉంచేందుకు ప్రయత్నించేవాడు. అందుకే పాండవులతో పోల్చినప్పుడు తాను తక్కువగా కనిపించకూడదనే ఉద్దేశంతో దుర్యోధ నుడు మరింత సమర్థవంతంగా పాలించేందుకు ప్రయత్నిస్తున్నాడని వివరించాడు.

ధర్మరాజుపై ఉన్న అసూయ, ద్వేషం దుర్యోధనుడిలో ఒక రకమైన పోటీ భావనను పెం చింది. 'ధర్మరాజు కంటే నేను మెరుగ్గా ఉం డాలి' అనే ఆలోచనతో అతను తన పరిపాలనపై శ్రద్ధ పెట్టాడు. ప్రజలకు తాను మంచి రాజుననే భావన కలిగించాలని ప్రయత్నించాడు. అంటే ధర్మరాజు అనే మంచి వాడితో దుర్యోధనుడి శత్రుత్వమే ఒక విధంగా అత న్ని మెరుగైన పరిపాలన వైపు నడిపించింది. మంచి వ్యక్తితో ఉన్న పోటీ కారణంగా చెడు ఆలోచనలు కలిగిన వ్యక్తి కూడా తన పనితీరును మెరుగుపరుచుకోవాల్సి వచ్చింది.

ఈ కథ ద్వారా నేటి పరిస్థితులను కూడా అర్థం చేసుకోవచ్చు. మన చుట్టూ ఉన్న వ్యక్తులు మనపై ప్రభావం చూపుతారు. మంచి వ్యక్తులతో పోటీ పడితే మనలో కూడా మంచి లక్షణాలు పెరుగుతాయి. వారి స్థాయిని అం దుకోవాలనే ప్రయత్నంలో మన పనితీరు మెరుగవుతుంది. అదే సమయంలో చెడు వ్యక్తులతో స్నేహం చేస్తే వారి అలవాట్లు, ఆ లోచనలు మనపై ప్రభావం చూపే అవకాశం ఉంటుంది.అందుకే 'చెడ్డ వారితో స్నే హం కంటే.. మంచి వారితో విరోధం మంచిది' అనే సామెతకు ఈ కథను ఉదాహరణగా చెబుతారు.

# వాహనం పట్టుకుంటే ఇలా చేయండి

ప్రస్తుతం చాలా మంది వాహనదారులు ఆర్సీ, డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్, పీయూసీ వంటి పత్రాలను ఫిజికల్‌గా వెంట తీసుకెళ్లడం లేదు. వాటికి బదులుగా డిజీలాకర్ లేదా ఎం–పరివాహన్ వంటి డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లలో పత్రాలను భద్రపరుచుకుని, అవసరమైనప్పుడు మొబైల్ లో చూపిస్తున్నారు. అయితే ఫోన్ కూడా వెంట లేకపోతే లేదా బ్యాటరీ అయిపోతే పరిస్థితి ఏంటి అనే సందేహం ఉంటుంది. ఇలాంటి సమయంలో పోలీసుల తనిఖీలు ఎదురైతే కచ్చితంగా ఫైన్ విధిస్తారు. అయితే ఈ ఫైన్ కూడా పడకుండా ఉండాలంటే ఏం చేయాలో తెలుసా?

సెంట్రల్ మోటార్ వెహికల్స్ రూల్స్ 1989 లోని రూల్ 139 ప్రకారం.. పోలీస్ అధికారి లేదా రాష్ట్ర ప్రభుత్వం అధికారం ఇచ్చిన అధికారి అడిగినప్పుడు వాహనానికి సంబంధించిన రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, ఇన్సూరెన్స్, ఫిట్‌నెస్, పర్మిట్, డ్రైవింగ్ లైసెన్స్, ఇతర సంబంధిత పత్రాలను చూపించాలి. అయితే ఆ సమయంలో పత్రాలు తన వద్ద లేకపోతే వాటిని తర్వాత సమర్పించే అవకాశం ఈ నిబంధన కల్పిస్తోంది.

పోలీసుల తనిఖీల సమయంలో పత్రాలు అందుబాటులో లేకపోతే రూల్ 139 ప్రకారం డిమాండ్ చేసిన తేదీ నుంచి 15 రోజుల్లోపు సంబంధిత పత్రాలను సమర్పించవచ్చు. నిబంధన ప్రకారం పత్రాల ధ్రువీకరించిన ఎక్స్‌ట్రాక్ట్‌లను వ్యక్తిగతంగా సమర్పించవచ్చు లేదా డిమాండ్ చేసిన అధికారికి రిజిస్టర్డ్ పోస్టు ద్వారా పంపవచ్చు. అంటే.. తనిఖీ సమయంలో వెంటనే పత్రా లు చూపించలేకపోయినంత మాత్రాన ఆ పత్రాలు అసలు లేవని అర్థం కాదు. చట్టం నిర్దేశించిన విధంగా తర్వాత వాటిని సమర్పించే అవకాశం ఉంది. అయితే పత్రాలు నిజంగా చెల్లుబాటయ్యేవిగా ఉండటం, నిర్ణీత విధానంలో సమర్పించడం ముఖ్యం.

అయితే ఇలా 15 రోజుల్లో పత్రాలు చూపిస్తే ఎలాంటి పరిస్థితుల్లోనూ ఫైన్ ఉండదని కొందరు అంటున్నారు. రూల్ 139 ప్రధానంగా పత్రాలు వెంట లేని సమయంలో వాటిని తర్వాత సమర్పించే విధానాన్ని చెబుతుంది. వాహనానికి అసలు చెల్లుబాటు అయ్యే పత్రాలు లేకపోవడం.. గడువు ముగిసినా కూడా పత్రాలు, ఇతర ట్రాఫిక్ ఉల్లంఘనలు వంటి వాటికి వర్తించే జరిమానాలు వేరుగా ఉండవచ్చు.



ఈ పరిస్థితి రాకుండా ఉండాలంటే తప్పనిసరిగా మొబైల్ తీసుకెళ్లాలి. వాహన పత్రాలను డిజిటల్ రూపంలో చూపించడానికీ చట్టపరమైన గుర్తింపు ఉంది. కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం.. డిజీలాకర్, ఎం–పరివాహన్‌లోని చెల్లుబాటయ్యే పత్రాలను ఫిజికల్ పత్రాలతో సమానంగా పరిగణించాలి. రూల్ 139లో చేసిన మార్పుల ద్వారా ఆర్సీ, ఇన్సూరె న్స్, ఫిట్‌నెస్, పర్మిట్, డ్రైవింగ్ లైసె న్స్, పీయూసీ వంటి పత్రాలను ఎలక్ట్రానిక్ రూపంలో సమర్పించే అవకాశం కల్పించారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
శనివారం 15.08.2026
www.mudranews.in | @mudranews



**అలసట, నీరసానికి ఉలవలు:**

ప్రోటీన్, ఫైబర్ అధికంగా ఉండే ఉలవలు కడుపును ఎక్కువసేపు నిండుగా ఉంచి స్థిరమైన శక్తిని అందించడంలో సహాయపడతాయి.



# ఘనంగా 'హర్ ఘర్ తిరంగా' ర్యాలీలు








**ముద్ర, కూకట్‌పల్లి:** భారతదేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని, ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు కూకట్‌పల్లి నియోజకవర్గంలో "హర్ ఘర్ తిరంగా" కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రశాంత్‌నగర్, కేపీహెచ్‌బీ డివిజన్‌లలో నిర్వహించిన భారీ తిరంగా ర్యాలీలు ఉత్సాహపూరిత వాతావరణంలో సాగాయి.ప్రశాంత్‌నగర్ డివిజన్‌లో , కేపీహెచ్‌బీ డివిజన్‌లో బీజేపీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరిగాయి. ఈ ర్యాలీలకు రాష్ట్ర బీజేపీ సీనియర్ నాయకులు వడ్డేపల్లి రాజేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరై, చేతిలో జాతీయ పతాకాన్ని చేతబూని ముందుండి నడిపించారు.ఈ ర్యాలీలలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువతతో పాటు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. త్రివర్ణ పతాకాలను చేతిలో పట్టుకుని చేసిన దేశభక్తి నినాదాలు ప్రాంగణమంతా మార్మోగాయి. ర్యాలీలో ప్రదర్శించిన భారీ జాతీయ పతాకం అందరినీ విశేషంగా ఆకట్టుకుంది.ఈ సందర్భంగా వడ్డేపల్లి రాజేశ్వరరావు మాట్లాడుతూ.. "హర్ ఘర్ తిరంగా" కార్యక్రమం ప్రతి ఇంట్లోనూ దేశభక్తి స్ఫూర్తిని నింపడమే కాకుండా, దేశం పట్ల మన బాధ్యతలను గుర్తుచేస్తుందని అన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఇళ్లపై జాతీయ జెండాను ఎగురవేసి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో సగర్వంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో వేగంగా అభివృద్ధి చెందుతోందని, దేశ ఐక్యత, సమగ్రతల కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు.

**తాండూరులో**

**ముద్ర ప్రతినిధి, తాండూర్:** తాండూరు పట్టణంలో స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా నిర్వహించిన తిరంగా ర్యాలీలో RBOL CEO, సీనియర్ కాంగ్రెస్ నాయకులు బయ్యని శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.జాతీయ జెండాను చేతబూని దేశభక్తి నినాదాలతో సాగిన ఈ ర్యాలీలో శ్రీనివాస్ రెడ్డి ఉత్సాహంగా పాల్గొని యువత, ప్రజల్లో దేశభక్తి స్ఫూర్తిని నింపారు. తాండూరు నెహ్రూ గంజ్ నుంచి ప్రారంభమైన ర్యాలీ పట్టణంలోని ప్రధాన వీధుల మీదుగా కొనసాగింది.ఈ సందర్భంగా బయ్యని శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ, దేశ ఐక్యత, సమగ్రతను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. జాతీయ జెండా మనందరిలో దేశభక్తి, ఐక్యత, గర్వభావాన్ని మరింత పెంపొందిస్తుందని అన్నారు.ఈ తిరంగా ర్యాలీలో పట్టణ పుర ప్రముఖులు, వ్యాపారస్తులు వివిధ పార్టీల రాజకీయ నాయకులు, ఆయా పార్టీల కౌన్సిలర్లు, పట్టణ అధ్యక్షులు, కార్యకర్తలు, యువత, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని జాతీయ స్ఫూర్తిని చాటి తిరంగా ర్యాలీని విజయవంతం చేయడం జరిగింది.

# కొలువుదీరిన మార్కెట్ కమిటీ కొత్త పాలకవర్గం

**నూతన పాలకవర్గానికి శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి**



**ముద్ర ప్రతినిధి, తాండూర్:** రైతుల సంక్షేమం కోసం అహర్నిశలు కృషిచేసి వారి అభివృద్ధి కోసం పాటుపడాలని నూతన పాలకవర్గానికి ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి సూచించారు.తాండూరు పట్టణంలోని క్లాసిక్ గార్డెన్స్‌లో తాండూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా వడ్డే శ్రీనివాస్ వైస్ చైర్మన్‌గా షేక్ కాశీం తో పాటు నూతన పాలకవర్గ సభ్యుల ప్రమాణస్వీకార మహోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే బయ్యని మనోహర్ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..రైతుల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తూ, రైతులకు మరింత మేలు జరిగేలా మార్కెట్ కమిటీని సమర్థవంతంగా నిర్వహించాలని, రైతులకు మంచి సేవలు అందిస్తూ మార్కెట్‌కు మంచి పేరు, మీకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు.అందరం కలిసి తాండూరు మార్కెట్‌ను మరింత అభివృద్ధి చేద్దాం. తాండూరు ధాన్యానికి మంచి గ్రేడింగ్, మంచి మార్కెట్ గుర్తింపు వచ్చేలా కృషి చేయాలని పేర్కొన్నారు.రైతుల అభ్యున్నతే మనందరి ప్రధాన బాధ్యత.ఒక రైతుగా నాకు రైతుల కష్టాలు, బాధలు స్వయంగా తెలుసు. అందుకే రైతుల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ ముందుండి పనిచేస్తానని తెలిపారు.ఒక సంవత్సరం లోపు నూతన మార్కెట్ యార్డును ప్రారంభించుకుందాం.కోట్ పల్లి, జుంటుపల్లి, శ్రీరాముల వారి ప్రాజెక్టులను బాగు చేసుకుని, రైతులకు చివరి ఆయకట్టు వరకు నీరందిస్తామన్నారూ.కాగ్నా నదిపై DPR (వివరణాత్మక ప్రాజెక్ట్ నివేదిక) సిద్ధం చేయించి, అవసరమైన చోట చెక్‌డ్యామ్‌లను నిర్మించుకుని రైతులకు సాగునీరు అందించేందుకు కృషి చేద్దాం.అలాగే కాగ్నా నది నుంచి తాండూరు పట్టణ ప్రజలకు తాగునీరు అందించేందుకు అవసరమైన సన్నాహాలు చేస్తున్నానీ తెలిపారు. ఎస్ ఐ ఆర్ ప్రక్రియలు భాగంగా ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలను చైతన్య పరచడం లో కీలక పాత్ర పోషించిన బి ఎల్ ఏ లందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రైతుల సంక్షేమం ప్రజల అభివృద్ధి మన అందరి లక్ష్యమని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ పట్లోళ్ల నీరజ, వైస్ చైర్ పర్సన్ అబ్దుల్ రజాక్, తాండూర్ పట్టణ అధ్యక్షులు బాతుల నాగరాజ్, తాండూర్ పట్టణ కౌన్సిలర్లు, వివిధ గ్రామాల సర్పంచులు, అధికారులు, పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్యామ్నాయ పంటలకు ప్రాధాన్యత ఇవ్వాలి

**వరి సాగుపై పూర్తిగా ఆధారపడొద్దు**
**నీటి లభ్యతను బట్టి పంటల ఎంపికరైతులకు**
**అవగాహన కల్పించి ప్రత్యామ్నాయ పంటల వైపు**
**ప్రోత్సహించాలి**
**కలెక్టర్ నారాయణరెడ్డి**

**ముద్ర ప్రతినిధి, ఉమ్మడి రంగారెడ్డి, ఆగస్టు 14:** వాతావరణ పరిస్థితులు, రానున్న రోజుల్లో వర్షపాతం అంచనాలు, అందుబాటులో ఉన్న నీటి వనరులను పరిగణనలోకి తీసుకుని రైతులు ముందస్తు ప్రణాళికతో పంటలు సాగు చేయాలని జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి సూచించారు. ఈ నెల 15 తర్వాత వర్షాలు తగ్గుముఖం పట్టే అవకాశం ఉన్నందున అధిక నీటి అవసరం ఉండే వరి పంటపై పూర్తిగా ఆధారపడకుండా తక్కువ నీటితో సాగు చేయగల ప్రత్యామ్నాయ పంటలకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.వర్షాధార ప్రాంతాల్లో భవిష్యత్‌లో నీటి లభ్యతను ముందుగానే అంచనా వేసుకుని పంటలను ఎంపిక చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. జలాశయాలు, చెరువులు, కాలువలు, బోర్లు తదితర నీటి వనరుల లభ్యతను పరిశీలించిన తర్వాతే అధిక నీటి అవసరం ఉన్న పంటలను సాగు చేయాలని తెలిపారు.ప్రత్యామ్నాయ పంటల వైపు దృష్టివరి పంటకు ప్రత్యామ్నాయంగా కంది, పెసర, మినుము, జొన్న, సజ్జ, మొక్కజొన్న, నువ్వులు వంటి తక్కువ నీటి అవసరం ఉన్న పంటలను స్థానిక నేల స్వభావం, వాతావరణ పరిస్థితులు, నీటి లభ్యతకు అనుగుణంగా ఎంపిక చేసుకోవాలని సూచించారు. అవసరమైన ప్రాంతాల్లో కూరగాయలు, ఆయిల్‌పామ్ వంటి పంటలను కూడా వ్యవసాయ శాఖ సాంకేతిక సూచనల మేరకు సాగు చేయాలని తెలిపారు.ఒకే పంటపై పూర్తిగా ఆధారపడటం వల్ల వాతావరణంలో అనూహ్య మార్పులు వచ్చినప్పుడు రైతులు నష్టపోయే అవకాశం ఉందన్నారు.



పంటల వైవిధ్యాన్ని ప్రోత్సహించడం ద్వారా వాతావరణ ప్రతికూలతల ప్రభావాన్ని తగ్గించడంతో పాటు, అందుబాటులో ఉన్న నీటిని సమర్థవంతంగా వినియోగించుకోవచ్చని పేర్కొన్నారు.గ్రామస్థాయిలో రైతులకు అవగాహనప్రతి గ్రామంలో వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు ప్రస్తుత వాతావరణ పరిస్థితులు, వర్షపాతం అంచనాలు, నీటి లభ్యత, ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. రైతులకు అవసరమైన సాంకేతిక సలహాలు అందించడంతో పాటు ఆయా ప్రాంతాలకు అనువైన పంటలను సూచించాలని తెలిపారు.వ్యవసాయ విస్తరణ అధికారులు రైతులతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ క్షేత్రస్థాయిలో పర్యటించాలని, వారి సందేహాలను నివృత్తి చేయాలని సూచించారు. విత్తనాల ఎంపిక, విత్తే సమయం, సాగు విధానం, నీటి వినియోగం, ఎరువుల వినియోగం తదితర అంశాలపై శాస్త్రీయ సూచనలు అందించాలని ఆదేశించారు.సెప్టెంబర్‌లోనూ అప్రమత్తంగా ఉండాలిసెప్టెంబర్‌లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నందున రైతులు ఇప్పటి నుంచే పంటల ఎంపికపై తగిన నిర్ణయాలు తీసుకోవాలని కలెక్టర్ నారాయణరెడ్డి సూచించారు. భవిష్యత్ నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని తక్కువ నీటి అవసరం ఉన్న పంటలను ఎంపిక చేసుకోవడం ద్వారా సాగు మధ్యలో నీటి కొరత ఏర్పడే పరిస్థితిని నివారించవచ్చన్నారు.రైతులు వాతావరణ హెచ్చరికలను నిరంతరం గమనించాలని, వాతావరణ శాఖ, వ్యవసాయ శాఖ జారీ చేసే సూచనలను పాటిస్తూ సాగు నిర్ణయాలు తీసుకోవాలని కోరారు.ముందస్తు ప్రణాళికతో పంట నష్టాలను తగ్గించుకోవచ్చుఅనిశ్చిత వర్షపాత పరిస్థితుల్లో ముందస్తు ప్రణాళికతో వ్యవసాయం చేయడం ద్వారా పంట నష్టాలను గణనీయంగా తగ్గించుకోవచ్చని కలెక్టర్ పేర్కొన్నారు. అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వినియోగించడం, తక్కువ నీటి అవసరం ఉన్న పంటలను ఎంపిక చేసుకోవడం, పంటల వైవిధ్యానికి ప్రాధాన్యత ఇవ్వడం రైతులకు ప్రయోజనకరంగా ఉంటుందన్నారు.రైతులు పంటల ఎంపికపై నిర్ణయం తీసుకునే ముందు సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారి లేదా వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించాలని సూచించారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా శాస్త్రీయ పద్ధతుల్లో సాగు చేపట్టి పంట నష్టాలను తగ్గించడంతో పాటు రైతుల ఆదాయాన్ని స్థిరంగా కొనసాగించేందుకు కృషి చేయాలని కోరారు. వ్యవసాయ శాఖ అధికారులు వాతావరణ పరిసితులను నిరంతరం పర్యవేక్షిస్తూ రైతులకు ఎప్పటికప్పుడు సాంకేతిక మార్గదర్శకాలు అందించాలని కలెక్టర్ ఆదేశించారు.

## వెయ్యి చీరలతో అమ్మవారి అలంకరణ

**శ్రావణ తొలి శుక్రవారం ఆలయం భక్తులతో కిటకిట**



**ముద్ర, బోడుప్పల్:** శ్రావణమాసం మొదటి శుక్రవారం సందర్భంగా శ్రీ మాతా నిమిషాంబ దేవి దేవాలయం శ్రావణ లక్ష్మీశోభతో నెలకొన్నది. 1116 చీరల విశేష అలంకరణలో అమ్మవారు దేదిప్యమానంగా వెలుగు దివ్వెల కాంతులతో ఉజ్వలంగా ప్రకాశిస్తూ దర్శన భాగ్యం కల్పిస్తున్నారు. తెల్లవారుజాము నుంచే భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ పరిసరాలు నిమిషాంబనామ స్మరణతో శ్రీ మాత్రే నమః స్మరణతో మార్మోగాయి. శ్రావణ మాసం దేవతలకు అత్యంత ప్రీతికరమైనది. ముఖ్యంగా ఈ మాసంలో లక్ష్మీదేవిని పూజించడం వల్ల విశేష ఫలితాలు లభిస్తాయి. శ్రావణ మాసం శ్రీమన్నారాయణుడైన విష్ణుమూర్తి జన్మ నక్షత్రం 'శ్రవణం'తో సంబంధం కలిగి ఉంటుంది. అందుకే విష్ణుమూర్తికి ప్రీతి పాత్రురాలైన లక్ష్మీదేవికి ఈ మాసం అంటే ఎంతో ఇష్టం. శ్రావణ మాసం శుక్రవారాలలో భక్తిశ్రద్ధలతో లక్ష్మీదేవిని పూజించడం వల్ల అష్టలక్ష్ములు ఆకర్షితులై, ఇంట్లో సుఖసంతోషాలు, సిరిసంపదలు వెల్లివిరుస్తాయని అమ్మవారి అనుగ్రహాన్ని పొందుతామని భక్తుల ప్రగాఢ విశ్వాసం. శ్రావణమాసం లో అమ్మవారిని మనసారా పూజిస్తే ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలతో, సిరి సంపదలు చేకూరుతాయన్నది భక్తుల నమ్మకం, మధ్యాహ్నం భక్తులందరికీ అన్నదానం చేయడం జరిగింది. ఆలయ చైర్మన్ కామరౌతు వినోద్ కుమార్, సెట్లర్ కళావతి, ప్రధాన కార్యదర్శులు కె. అశోక్ కుమార్, సంగు శ్రీనివాస్, కోశాధికారి ఎన్.రమేష్ , రాష్ట్ర నకాష్ సంఘం ప్రధాన కార్యదర్శి కొరిచెర్ల శ్రీనివాస్ రావు ఆలయంలో భక్తులకు సౌకర్యాలు కల్పించారు. ఆలయ ట్రస్ట్ ధర్మకర్తలు బి. హిమచందర్, వై. చంద్రశేఖర్, ఎస్. గౌరి శంకర్, డి. నర్సింగ్ రావు, ఎమ్. శ్రీనివాస్ రావు, ఎమ్. సాయి బాబా (శ్యామ్), డి. సతీష్, రామగిరి శ్రీకాంత్, ఎన్. శ్రీకాంత్, ఎన్ . రామకృష్ణ, ఎన్. మోహన్, డి. రామక్రిష్ణ, ఎన్. శ్రీధర్, వెంకట్ రాజారావు, కె. ప్రవీణ్ కుమార్, డి. నరేష్, వై. సత్యనారాయణ పాల్గొన్నారు. ఆలయ ప్రధాన అర్చకులు చంద్రశేఖర్ శర్మ, అర్చకుడు ఉమాకాంత్ శర్మ పాల్గొన్నారు.

## జలమయ సమస్యల నివారణకు హైడ్రా కమిషనర్ క్షేత్రస్థాయి పరిశీలన



**ముద్ర, శేరిలింగంపల్లి :** నగరంలో నీటి నిల్వ (వాటర్‌లాగింగ్ ) సమస్యల శాశ్వత పరిష్కారానికి హైడ్రా కమిషనర్ ఎ.వి. రంగనాథ్ ఐపీఎస్, మరియు శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ నారాయణ అమిత్ గురువారం అధికారులతో కలిసి ఉమ్మడిగా క్షేత్రస్థాయిలో పర్యటించారు. శేరిలింగంపల్లి జోన్ పరిధిలోని మల్కం చెరువు, ఎలక్షన్ కమిషన్ కార్యాలయం మరియు హెచ్‌సీయూ పరిసర ప్రాంతాల్లోని ప్రధాన వాటర్‌లాగింగ్ పాయింట్లను స్వయంగా పరిశీలించారు. ఉమ్మడి తనిఖీల్లో శేరిలింగంపల్లి జోన్ డెప్యూటీ కమిషనర్, హైడ్రా ఉన్నతాధికారులు మరియు శేరిలింగంపల్లి సర్కిల్ ఇంజనీరింగ్ విభాగం అధికారులు పాల్గొన్నారు.డ్రైనేజీ వ్యవస్థ సమీక్ష: వరద నీటి కాలువలు (స్టార్మ్ వాటర్ డ్రెయిన్స్ ), ప్రస్తుత డ్రైనేజీ ఏర్పాట్లను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. వర్షపు నీరు ఎక్కడికక్కడ నిలిచిపోకుండా, సులువుగా ముందుకు సాగేలా చేపట్టాల్సిన తక్షణ చర్యలపై చర్చించారు. వర్షాల సమయంలో వాహనదారులకు, ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా హైడ్రా మరియు ఇంజనీరింగ్ అధికారులు సమన్వయంతో పనిచేయాలని కమిషనర్లు ఆదేశించారు. గుర్తించిన సమస్యలకు తక్షణమే తాత్కాలిక మరియు శాశ్వత పరిష్కారాలు చూపి, పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.

## వరద నీటి కాలువ నిర్మాణ పనులను పరిశీలించిన అరెకపూడి



**ముద్ర, శేరిలింగంపల్లి:** శేరిలింగంపలి డివిజన్ మసీదు బండ లోని కుడికుంట చెరువు అలుగు నుండి మసీదు బండ ప్రభుపాద లే ఔట్ కాలనీ వరకు రూ. 4 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో నిర్మాణం జరుగుతున్న వరద నీటి కాల్వ పనులను పరిశీలించిన పీయేసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ. ఈ సందర్భంగా చైర్మన్ గాంధీ మాట్లాడుతూ మసీదు బండ లోని ప్రభు పాద లే ఔట్ కాలనీ లో నెలకొన్న వరద నీటి కాల్వ ఔట్ లెట్ సమస్య కు త్వరలోనే శాశ్వత పరిష్కారం చూపుతామన్నారు. సుమారుగా 4 కోట్ల రూపాయలతో వరద నీటి కాల్వ నిర్మాణం పనులు చేపడుతున్నామని, ప్రజల ఇబ్బందులను, వర్షాకాలంను దృష్టిలో పెట్టుకొని పనులు త్వరిత గతిన చేపట్టి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని గాంధీ తెలియచేశారు. వరద నీటి కాల్వ ఔట్ లెట్ సరిగ్గా లేక వరద నీరు చేరి కాలనీ ముంపుకు గురి అవుతుంది అని ప్రజలు, కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారని, సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా అన్ని రకాల చర్యలు తీసుకోవాలనే ఉద్దేశ్యవంతో పక్కా ప్రణాళికలు వేసుకొని ప్రతిపాదనలు సిద్ధం చేసి యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టాలని చైర్మన్ గాంధీ అధికారులకు సూచించారు. కుడీ కుంట చెరువు ఔట్ లెట్ నుండి నీటి ప్రవాహం అధిక మొత్తంలో వస్తుంది కావున చెరువు ఔట్ లెట్ ను పరిగణలోకి తీసుకోవాలని, మళ్ళీ వరద ముంపు సమస్య పునరావృతం కాకుండా వరద నీటి కాల్వ నిర్మాణం చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
శనివారం 15.08.2026
www.mudranews.in | @mudranews



### పప్పులను మితంగా తీసుకోవాలి

పప్పులు ఆరోగ్యకరమైనవే అయిన ప్పటికీ, వ్యక్తి ఆరోగ్య పరిస్థితిని బట్టి వాటి ప్రభావం మారవచ్చు. గ్యాస్, బ్లోటింగ్ వంటి సమస్యలు ఉంటే నానబెట్టి, బాగా ఉడికించి మితంగా తీసుకోవడం మంచిది.



# ఉప్పొంగిన దేశభక్తి... వందేమాతరం... భారత్ మాతాకీ జై..!

**కరీంనగర్‌లో ఘనంగా 'హర్ ఘర్ తిరంగా' భారీ ర్యాలీ..**
**తెలంగాణ చౌక్ నుండి రామ్‌నగర్ వరకు సాగిన ర్యాలీలో పెద్ద ఎత్తున పాల్గొన్న యువత, విద్యార్థులు..**




**ముద్ర, కరీంనగర్ :** భారతదేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా కరీంనగర్‌లో భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ఆధ్వర్యంలో 'హర్ ఘర్ తిరంగా' అభియాన్ ప్రోగ్రాంలో భాగంగా శుక్రవారం రోజున భారీ తిరంగా ర్యాలీని అత్యంత వైభవంగా నిర్వహించారు. కరీంనగర్‌లోని ప్ తెలంగాణ చౌక్ నుండి ప్రారంభమైన ఈ ర్యాలీ రామ్‌నగర్ వరకు కోలాహలంగా సాగింది.

ఈ ర్యాలీలో పెద్ద సంఖ్యలో కళాశాల విద్యార్థులు, యువకులు, బీజేపీ నాయకులు కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రతి ఒక్కరూ చేతుల్లో త్రివర్ణ పతాకాలను పట్టుకుని, దేశభక్తిని చాటేలా 'భారత్ మాతా కీ జై', 'వందేమాతరం' అంటూ చేసిన నినాదాలతో కరీంనగర్ వీధులు మార్మోగాయి. యువతలో జాతీయ భావాలను, దేశంపై మమకారాన్ని పెంపొందించేలా ఈ కార్యక్రమం అద్భుతంగా కొనసాగింది. ఈ ప్రోగ్రాంకు ముఖ్యఅతిథిగా హాజరైన మాజీ ఎమ్మెల్యే ధర్మారావు మాట్లాడుతూ 'హర్ ఘర్ తిరంగా' అభియాన్ ప్రాముఖ్యత ను ప్రతి ఒక్కరు గుర్తించాలన్నారు. 'హర్ ఘర్ తిరంగా' అనేది దేశవ్యాప్తం గా పౌరుల్లో జాతీయ భావాలను ఇనుమడింపజేయడానికి చేపట్టిన ఒక గొప్ప ఉద్యమం లాంటిదని తెలిపారు. ప్రతి ఒక్కరూ జాతీయ స్ఫూర్తి కలిగి ఉండాలని, దేశం కోసం ప్రాణాలర్పించిన మహానీయులను స్వాతంత్ర్య సమరయోధులను ఈ సందర్భంగా స్మరించుకోవాల న్నారు. కుల, మత, ప్రాంతీయ భేదాలకు అతీతంగా ప్రతి భారతీయుడు జాతీయ జెండా నీడన ఒక్కటవ్వడం, దేశ గౌరవాన్ని పెంచుతూ, జాతీయ జెండా ప్రాముఖ్యతను, గౌరవాన్ని ప్రతి ఒక్కరికీ తెలియజేస్తూ ముందుకు కొనసాగాలని పిలుపునిచ్చారు. బిజెపి జిల్లా అధ్యక్షులు సాయిని మల్లేశం మాట్లాడుతూ తిరంగా ర్యాలీలో పెద్ద ఎత్తున పాల్గొని , ప్రోగ్రాంను విజయవంతం చేసిన కళాశాల విద్యార్థులకు , యువకులకు , పార్టీ శ్రేణులకు ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు చెప్పారు. ముఖ్యంగా ప్రత్యేక ఈ ర్యాలీ ద్వారా కరీంనగర్ ప్రజలకు, ముఖ్యంగా యువతకు జాతీయ జెండా గొప్పతనాన్ని వివరించడమే కాకుండా, ప్రతి ఒక్కరూ తమ ఇళ్లపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి దేశభక్తిని చాటాలని ఆయన ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

ఈ ప్రోగ్రాం లో మాజీ శాసనసభ్యులు బుడిగే శోభ, నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, మాజీ జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి , రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గుగ్గిళ్ళపు రమేష్ , బంగారు రాజేంద్రప్రసాద్, ఇనుగొండ నాగేశ్వర్ రెడ్డి , జిల్లా ప్రధాన కార్యదర్శులు తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్, మాడ వెంకటరెడ్డి , సీనియర్ నాయకులు కన్నబోయిన ఓదెలు, గుజ్జ శ్రీనివాసరావు, వాసాల రమేష్ , పార్లమెంట్ కన్వీనర్ బోయినిపల్లి ప్రవీణ్ రావు, మహిళా మోర్చా అధ్యక్షురాలు నిర్మలాదేవి, యువ మోర్చా అధ్యక్షులు సంఘ నరేష్, కిసాన్ మోర్చా అధ్యక్షులు మోతె గంగారెడ్డి , ఓబిసి మోర్చా అధ్యక్షులు ఆకుల రాజేందర్, మైనారిటీ మోర్చా అధ్యక్షులు పర్వేజ్, ముజీబ్ , ఎస్సీ మోర్చా అధ్యక్షులు బత్తుల లక్ష్మీనారాయణ , ఎస్టి మోర్చా అధ్యక్షులు శ్రీనివాస్ నాయక్ , మీడియా కన్వీనర్ కటకంలోకేష్ లతోపాటు కార్పొరేటర్లు, ప్రజా ప్రతినిధులు , వివిధ మండలాల, జోన్ అధ్యక్షులు, నాయకులు కార్యకర్తలతో పాటు వివిధ కళాశాలలో చెందిన విద్యార్థులు, యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.,

## మైసమ్మ ఆలయ తాత్కాలిక షెడ్డు తొలగింపు

**సవాల్ విసిరిన బిజెపి పట్టణ శాఖ, ధార్మిక సెల్ ఎండోమెంట్....**



**ముద్ర, కోరుట్ల:** కోరుట్ల పట్టణంలోని గడి బురుజుల వద్ద మైసమ్మ తల్లి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన షెడ్డును కొందరు తొలగించడంపై బీజేపీ పట్టణ శాఖ, ధార్మిక సెల్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం గడి బురుజుల ప్రాంతాన్ని సందర్శించిన వారు.. ఆలయ స్థలం తమదేనని చెబుతున్న వారు సంబంధిత ఆధారాలతో మైసమ్మ తల్లి ఆలయం వద్దకు రావాలని సవాల్ విసిరారు. గడి బురుజులను ఆనుకుని సామిల్ డిపో, మినీ ఫంక్షన్ హాల్, ఆయిల్ మిల్ నిర్మాణాలకు అనుమతులు ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. 48 గంటల్లో అక్రమ నిర్మాణాలను తొలగించకపోతే మున్సిపల్ కార్యాలయం ముట్టడి చేస్తామని హెచ్చరించారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. 9 కులాల కుల సంఘాల సభ్యులు, బిజెపి పట్టణ ప్రధాన కార్యదర్శి ఎర్ర రాజేం దర్, చెట్లపెల్లి సాగర్, మ్యకల గణేష్, గందె నవీన్, ఉపాధ్యక్షులు మైదం సత్యనారాయ ణ, దళిత మోర్చా అధ్యక్షులు బెక్కం అశోక్, బిజెపి, బిజెవైఎం నాయకులు పాల్గొన్నారు.

## ఒత్తిడిని దూరం చేసేందుకు క్రీడలు ఎంతో దోహదపడతాయి

**ముద్ర, కోరుట్ల;** స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని మెట్‌పల్లి పురపాలక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక స్నేహపూర్వక క్రికెట్ మ్యాచ్ అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి, హాజరై మ్యాచ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులు, అధికారులు, సిబ్బంది మధ్య స్నేహభావం, సమన్వయం పెంపొందించేందుకు మరియు పని ఒత్తిడిని దూరం చేసుకునేందుకు ఇలాంటి క్రీడా పోటీలు ఎంతో దోహదపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ ఓంకార్ నవీన్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ గౌడ్, కౌన్సిలర్లు, పురపాలక సంఘ అధికారులు, కార్యాలయ సిబ్బంది, తదితరులు, పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు.



# ఆలయ అభివృద్ధికి సహకారం అందిస్తా

*** సుందరగిరి వెంకన్న ఆలయాన్ని సందర్శించిన అసిస్టెంట్ కమిషనర్ సుప్రియ**



**ముద్ర చిగురుమామిడి :** మండలంలోని సుందరగిరి గ్రామంలో కొలువుదీరిన శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానాన్ని కరీంనగర్ దేవాదాయ, ధర్మాదాయ శాఖ సహాయ కమిషనర్ నాయిని సుప్రియ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు శేషం నవీనాచార్యులు ఆమెకు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం స్వామివారి శేషవస్త్రంతో సన్మానించారు.ఈ సందర్భంగా సహాయ కమిషనర్ శ్రీమతి సుప్రియ మాట్లాడుతూ సుందరగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ముఖ్యంగా ఆలయ కళ్యాణ మండపం నిర్మాణంతో పాటు, కొండపై ఘాట్ రోడ్డు నిర్మాణం గురించి అలాగే భక్తులకు మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు చేపట్టే ఇతర అభివృద్ధి పనులకు సహకరిస్తానని పేర్కొన్నారు.

ఆలయ అభివృద్ధికి అవసరమైన చర్యలను సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటూ ముందుకు తీసుకెళ్తామని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు, ఆలయ రికార్డు అసిస్టెంట్ బూట్ల కవిత, దేవస్థాన అభివృద్ధికి సంబంధించిన అంశాలను సహాయ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు.

# కీలక శాఖల్లో మంత్రుల అవినీతి

**అవినీతిపై ప్రశ్నిస్తే తప్పుడు కేసులు**
**స్థానిక ఎన్నికల నిర్వహణలో కావాలనే జాప్యం**
**బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి**



**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా అవినీతిమయమై పోయిందని అధికారంలోకి రామనే భయంతో ముఖ్యమంత్రి, మంత్రులు దీపం ఉన్నప్పు డే ఇల్లు చక్కబెట్టుకోవాలన్న ధోరణిలో ఉన్నారని బీజేఎల్పీ నేత, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి ధ్వజమెత్తారు. ఈ మేరకు నిర్మల్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి లు నిర్వహిస్తున్న కీలక శాఖల్లో వసూళ్లు, కమిషన్ల ఆరోపణలు తీవ్ర స్థాయికి చేరాయని ఆరోపించారు. రిటైర్డ్ ఉద్యోగుల బెనిఫిట్ బిల్లుల క్లియరెన్స్ కు 10 శాతం, చిన్న కాంట్రాక్టర్ల బిల్లులకు 20 శాతం, మరికొన్ని బిల్లులకు 30 శాతం కమిషన్ అడిగారనే ఆరోపణలపై ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క స్పందించాలని డిమాండ్ చేశారు. సీఎం సోదరుడు కొండల్ రెడ్డికి చెందిన టెసరాక్ట్ అడ్వాన్స్డ్ సిస్టమ్స్ కంపెనీకి సుమారు రూ.200 కోట్ల విలువైన ఐదెకరాల ప్రభుత్వ భూమిని కేవలం రూ.7 కోట్లకే కేటాయించారనే మీడియా కథనాలపై సీఎం వివరణ ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. రూ.1లక్ష రూపాయల పెట్టుబడితో ఏర్పడి, ఉద్యోగులు కూడా లేరని చెబుతున్న కంపెనీకి విలువైన ప్రభుత్వ భూమిని ఏ ప్రాతిపదికన కేటాయించారో బహిర్గతం చేయాలన్నారు. మీడియా సమావేశంలో బీజేపీ సీనియర్ నాయకులు రావుల రాంనాథ్, చిన్నయ్య, కౌన్సిలర్లు గంజి రాజు, శ్రీరామోజీ నరేష్, అర్జున్, ఈశ్వర్,సాత్విక్ పాల్గొన్నారు.

## రెండు ఇళ్లలో చోరీలు.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



**ముద్ర, చిగురు మామిడి,:** మండలం లోని సుందరగిరి గ్రామంలో రెండు ఇళ్లలో గుర్తుతెలియని వ్యక్తులు చోరీలకు పాల్పడ్డారు. ఈ ఘటనలు ఆగస్టు 11 మధ్యాహ్నం నుంచి 14 ఉదయం మధ్య జరిగి నట్లు ఎస్ఐ జగదీష్ తెలిపారు. దేవులపల్లి జ్యోతి ఇంటి తాళం పగులగొట్టి రూ.50 వేల నగదు, సుమారు ఒక తులం బంగా రం, అల్యూమినియం సామగ్రి అపహరిం చగా, మొత్తం నష్టం రూ.81 వేలుగా అంచనా వేశారు. మరో ఇంట్లో సుమారు 90 తులాల వెండి వస్తువులు, రూ.15 వేల నగదు చోరీ అయ్యాయి. రెండు ఘటనలపై కేసులు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఇళ్లను ఖాళీగా ఉంచి వెళ్లేటప్పుడు పొరుగువారికి సమాచారం ఇవ్వాలని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, విలువైన వస్తువులను ఇంట్లో ఉంచవద్దని పోలీసులు సూచించారు.

## ఖర్గే అవమానాన్ని ఖండిస్తూ కాంగ్రెస్ సత్యాగ్రహం



**ముద్ర, కరీంనగర్:** ఉత్తరాఖండ్ లో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రసంగించిన సభా ప్రాంగణాన్ని గంగాజలంతో శుద్ధి చేశారనే ఘటనను ఖండిస్తూ కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ ఆధ్వర్యంలో శుక్రవారం భారీ పాదయాత్ర నిర్వహించారు. కిసాన్ నగర్ లోని మహాత్మాగాంధీ విగ్రహం నుంచి కోర్టు చౌరస్తాలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వరకు పాదయాత్ర సాగింది. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి సత్యాగ్రహ దీక్ష చేపట్టారు. చొప్పదండి ఎమ్మెల్యే, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు డాక్టర్ మేడిపల్లి సత్యం మాట్లాడుతూ కుల వివక్ష, అంటరానితనం కొనసాగడం దురదృష్టకరమన్నారు. ఖర్గేకు, దళిత బహుజనులకు జరిగిన అవమానంపై పూర్తి విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షుడు వైద్యుల అంజన్ కుమార్, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్ లో శ్రావణ శోభ




**ముద్ర, కరీంనగర్ :** అన్ని మాసాలలో శ్రావణ మాసానికి ప్రత్యేకత ఉన్నదని.. ఈ మాసంలో వివిధ రకాల పూజలను నిర్వహించడం జరుగుతుందని అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి గారు స్థానిక కొత్తపల్లిలోని ఆల్ఫోర్స్ ఇ–టెక్నో పాఠశాలలో శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని నిర్వహించినటువంటి శ్రావణ శోభ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై వారు శ్రీగౌరీ మాతకు పూజా కార్యక్రమాన్ని నిర్వహించి వేడుకలను అట్టహాసంగా ప్రారంభించారు. ఈ సందర్భం గా వారు మాట్లాడుతూ శ్రావణ మాసంలో పలు దానధర్మాలను సైతం చేసి ఆయుష్షు ను పెంచుకోవడం, పుణ్యఫలాలను పొందడం ప్రత్యేకమని వారు చెప్పారు. శ్రావణ మాసం అత్యంత పవిత్రమైనదని మరియు బ్రాహ్మణుల యొక్క మార్గదర్శకాన్ని అనుసరిస్తూ చాలామంది విశేష ఫలితాలను అనుభవిస్తారని మరియు ఆలయాలను సందర్శించి దానాలను చేస్తారని వారు చెప్పారు. శ్రావణమాస ప్రాముఖ్యతను పురస్కరించుకొని విద్యార్థులు చేసినటువంటి సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేకంగా నృత్య ప్రదర్శనలను చాలా ఆకర్షణగా నిలిచాయి. ప్రాంగణాన్ని అందంగా వివిధ రకాల పూలతో వస్తువులతో అలంకరించి పండుగ శోభను రెట్టింపు చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు

## గీతన్నల చైతన్య యాత్రను విజయవంతం చేయాలి

**శనివారం కరీంనగర్ చేరుకోనున్న బస్సు యాత్ర**
**- కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు తాళ్లపల్లి తిరుపతి గౌడ్**



**ముద్ర చిగురుమామిడి:** కల్లుగీత కార్మికులు ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కల్లుగీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో చేపడుతున్న 'గీతన్నల చైతన్య యాత్ర'ను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు తాళ్లపల్లి తిరుపతి గౌడ్ పిలుపునిచ్చారు. అమరుల జ్ఞాపకార్థం శనివారం కరీంనగర్ నుంచి చిగురుమామిడి మీదుగా సర్వేపేట వరకు ఈ బస్సు యాత్ర సాగనుందని ఆయన వెల్లడించారు. ఈ యాత్ర మార్గమధ్యంలో చిగురుమామిడి మండల కేంద్రంలో బహుజన వీరుడు, బహుజన రాజ్య స్థాపకుడు సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించను న్నట్లు తెలిపారు.గీత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టాలని తాళ్లపల్లి తిరుపతి గౌడ్ డిమాండ్ చేశారు. తమ న్యాయమైన డిమాండ్ల సాధనకై సాగుతున్న ఈ చైతన్య యాత్రకు జిల్లాలోని గీత కార్మికులు, గౌడ బంధువులు, కార్మిక సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

## ట్రాక్టర్ లతో ఘనంగా హర్ ఘర్ తిరంగా ర్యాలీ



**ముద్ర చిగురుమామిడి:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గారి పిలుపుమేరకు చిగురుమామిడి మండల భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షుడు పోలోజు సంతోష్, బీజేపీ కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు శామాకూర మోహన్ రెడ్డి గార్ల నేతృత్వంలో రైతులతో కలిసి ట్రాక్టర్ లతో జాతీయ జెండాలతో హర్ ఘర్ తిరంగా ర్యాలీని మండల కేంద్రంలోని పురవీధుల్లో ఘనంగా నిర్వహించారు .ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిలుగా బిజెపి రాష్ట్ర మాజీ కార్యవర్గ సభ్యుడు కోమటిరెడ్డి రాంగోపాల్ రెడ్డి , బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి చిగురుమామిడి మండల పార్టీ ఖమ్మం వేంకటేశం హాజరై ర్యాలీలో పాల్గొన్నారు. చిగురుమామిడి పెట్రోల్ బంక్ నుంచి ప్రారంభమై ట్రాక్టర్ లతో తిరంగా ర్యాలీ గ్రామ పురవీధుల గుండా బస్టాండ్ వరకు కొనసాగింది రైతులు బీజేపీ కార్యకర్తలు, యువత జాతీయ జెండాలను చేతబూని దేశభక్తి నినాదాలతో ర్యాలీలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోమటిరెడ్డి రాంగోపాల్ రెడ్డి గారు మాట్లాడుతూ భారత జాతీయ జెండా ప్రతి భారతీయుడి గర్వానికి, దేశ ఐక్యతకు ప్రతీక అని అన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి దేశభక్తిని చాటాలని పిలుపునిచ్చారు. బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి మండల ప్రభారీ ఖమ్మం వేంకటేశం, బిజెపి మండల అధ్యక్షుడు పోలోజు సంతోష్ , కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు శామాకూర మోహన్ రెడ్డి మాట్లాడారు. ట్రాక్టర్ ర్యాలీ చిగురుమామిడి మండలంలో దేశభక్తి స్ఫూర్తిని నింపిందని కొనియాడారు. బిజెపి మండల ప్రధాన కార్యదర్శులు గునుకుల మధుసూదన్ రెడ్డి బుద్ధర్తి మహేందర్,మాజీ మండల మాజీ అధ్యక్షుడు అచ్చ రవీందర్, మాజీ జిల్లా అధికారప్రతినిది పొన్నం శ్రీనివాస్ కంది శంకర్ మండల పార్టీ ఉపాధ్యక్షుడు గందే చిరంజీవి, మండల పార్టీ కార్యదర్శి నక్క రాజేందర్, బిజెపి యువమోర్చా మండల అధ్యక్షుడు సిద్దంకి అనిల్,బీజేపీ మహిళ మోర్చా మండల అధ్యక్షురాలు బుర్ర విజయ బిజెపి ఓబీసీమోర్చా మండల అధ్యక్షుడు పడాల శ్రీనివాస్ బిజెపి దళిత మోర్చా మండల అధ్యక్షుడు దొంత కరుణాకర్,తీగలకుంటపల్లి మాజీ సర్పంచ్ మ్యాకాల చంద్రశేఖర్ రెడ్డి, వివిధ బాధ్యతల్లో ఉన్న బిజెపి పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
శనివారం 15.08.2026
www.mudranews.in | @mudranews



## ఎముకల బలానికి మినపప్పు:

కాల్షియం, మెగ్నీషియం, ఫాస్ఫరస్ వంటి ఖనిజాలు ఉండటంతో ఎముకల ఆరోగ్యానికి మినపప్పు ఉపయోగ కరంగా ఉంటుంది.



# కార్మిక–రైతు వ్యతిరేక బీజేపీ పాలనకు చరమగీతం పాడాలి

**కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక బీజేపీ విధానాలను తిప్పికొట్టాలి**
**సెప్టెంబర్ 1న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయండి**
**సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎండీ ఇమ్రాన్**



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి** :కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను యావత్ దేశ ప్రజలు ఐక్యమై తిప్పి కొట్టాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం డి ఇమ్రాన్ పిలుపునిచ్చారు.శుక్రవారం కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక పాలనను నిరసిస్తూ ఏఐటీయూసీ, సీపీఐ భువనగిరి పట్టణ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రచార జాతను సీపీఐ యాదాద్రి భువనగిరి జిల్లా కార్యవర్గ సభ్యులు ఎండీ ఇమ్రాన్ భువనగిరి పట్టణంలోని కొత్త బస్టాండ్ ఎదురుగా జెండా ఊపి ప్రారంభించన అనంతరం ఇమ్రాన్ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికులు, రైతులు, సామాన్య ప్రజల ప్రయోజనాలకు విరుద్ధంగా విధానాలను అమలు చేస్తోందని విమర్శించారు. కార్మికుల హక్కులను హరిస్తూ కార్మిక చట్టాలను నిర్వీర్యం చేసే చర్యలకు పాల్పడుతోందని అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు వ్యక్తులకు అప్పగిస్తూ దేశ ఆర్థిక వ్యవస్థను బలహీనపరుస్తున్నారని విమర్శించారు.నిత్యావసర వస్తువుల ధరలు రోజురోజుకూ పెరుగుతున్నా ప్రజల ఆదాయాలు పెరగడం లేదని, నిరుద్యోగం పెరుగుతున్నా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని అన్నారు. రైతులకు గిట్టుబాటు ధర, కార్మికులకు కనీస వేతనం, ఉద్యోగ భద్రత, సామాజిక భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా కార్మికులు, రైతులు, ప్రజలను ఐక్యం చేసి దేశవ్యాప్తంగా ఉద్యమాలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా సెప్టెంబర్ 1న ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో జరిగే భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ భారీ సభకు భువనగిరి పట్టణం నుంచి కార్మికులు, రైతులు, ఉద్యోగులు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టి, కార్మికులు, రైతులు, సామాన్య ప్రజల హక్కుల పరిరక్షణ కోసం ఐక్యంగా పోరాడాలని ఇమ్రాన్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు సోమన సబిత, ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి గనబోయిన వెంకటేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు సామల శోభన్ బాబు, సిపిఐ పట్టణ కార్యదర్శి పుట్ట రమేష్, మధ్యాహ్న భోజనం వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ముంతాజ్ బేగం, రచ్చ మోహన్ దాస్, ఉమేష్, మల్లేష్, శ్రీను, నరసింహ, జగన్, రాజు, వెంకటేష్, ఉపేందర్ పాల్గొన్నారు.

# భార్యాభర్తల జంట హత్య కేసును 24 గంటల్లో ఛేదించిన పోలీసులు

**సీసీ కెమెరాలు, సాంకేతిక ఆధారాలతో నిందితుల గుర్తింపు**
**కానిస్టేబుల్ సహా ఇద్దరి అరెస్టు**





**ముద్ర, సూర్యాపేట, ఆగస్టు 14:** మోతే మండలంలో సంచలనం సృష్టించిన భార్యాభర్తల జంట హత్య కేసును పోలీసులు 24 గంటల్లో ఛేదించారు. సీసీ కెమెరా ఫుటేజీ, సాంకేతిక ఆధారాలు, స్థానికుల సమాచారంతో నిందితులను గుర్తించి అరెస్ట్ చేసినట్లు సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్ తెలిపారు. కేసుకు సంబంధించి మోతే పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ ఎం.డి. షరీఫ్ (23), మోతే గ్రామానికి చెందిన జిల్లేపల్లి సుందర్‌ను అరెస్ట్ చేసినట్లు వెల్లడించారు.జిల్లా పోలీస్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎస్పీ కేసు వివరాలను వెల్లడించారు. మోతే మండల కేంద్రం శివారులో జాతీయ రహదారి 365బీబీ ఫ్లైఓవర్‌కు సుమారు 200 మీటర్ల దూరంలో వ్యవసాయ భూమిలో కాళ్లు బయటకు కనిపించేలా మృతదేహాలను పాక్షికంగా పాతిపెట్టినట్లు గురువారం ఉదయం స్థానికుల నుంచి పోలీసులకు సమాచారం అందింది. దీంతో కోదాడ డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, మునగాల సీఐ రామకృష్ణారెడ్డి, ఎస్సై లచ్చిరెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను వెలికితీశారు.మృతులను మోతే మండలం బిక్యతండాకు చెందిన హలావత్ నాగులు (41), ఆయన భార్య హలావత్ బూబాగా గుర్తించారు. వీరు వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తూ మోతేలో కౌలు భూములు సాగు చేస్తున్నారు.డబ్బుల వ్యవహారమే హత్యలకు కారణంపోలీసుల దర్యాప్తులో వెల్లడైన వివరాల ప్రకారం.. సుందర్ ద్వారా షరీఫ్‌కు నాగులు, బూబాతో పరిచయం ఏర్పడింది. కుటుంబ సమస్యల నేపథ్యంలో బూబా, నాగులు కోరడంతో షరీఫ్ వారికి సుమారు రూ.3 లక్షలు ఇచ్చినట్లు పోలీసులు తెలిపారు. ఆ డబ్బును తిరిగి ఇవ్వాలని కోరిన సమయంలో ఇరువురి మధ్య వివాదం ఏర్పడిందని, తనపై అట్రాసిటీ కేసులు పెడతామని వారు బెదిరించడంతో వారిని హత్య చేయాలని షరీఫ్ నిర్ణయించుకున్నట్లు వెల్లడించారు.ఈ క్రమంలో సుందర్ సహకారంతో హత్యకు పథకం వేసినట్లు పోలీసులు తెలిపారు. గొర్రెల రుణం ఇప్పిస్తానని నమ్మించి, రుణం కోసం గొర్రెలను చూపించాల్సి ఉంటుందని చెప్పి నాగులు, బూబాను గ్రామ శివారుకు రప్పించేలా నిందితులు ప్రణాళిక రూపొందించారు.గుదిబండతో నాగులుపై దాడిఈ నెల 11న రాత్రి షరీఫ్, సుందర్ కలిసి నాగులను మోటార్‌సైకిల్‌పై మోతే గ్రామ శివారులోని జాతీయ రహదారి 365బీబీ ఫ్లైఓవర్ సమీపానికి తీసుకెళ్లారు. అక్కడ గురత తీయాలని చెప్పి నాగులతోనే గుంత తీయించిన అనంతరం వెనుక నుంచి గుదిబండతో తలపై బలంగా కొట్టినట్లు పోలీసులు తెలిపారు. తీవ్ర గాయాలతో నాగులు గుంతలో పడిపోగా, మృతి చెందినట్లు నిర్ధారించుకున్న అనంతరం మృతదేహాన్ని అదే గుంతలో పూడ్చిపెట్టినట్లు వెల్లడించారు.కొంతసేపటి తర్వాత బూబాను ఫొటో దిగాలని చెప్పి అదే ప్రాంతానికి తీసుకెళ్లి ఆమెపై కూడా దాడి చేసి హత్య చేసినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం మృతదేహాన్ని గుంతలో పాతిపెట్టడంతో పాటు ఆమె ఒంటిపై ఉన్న ఆభరణాలను కూడా నిందితులు తీసుకెళ్లినట్లు వెల్లడించారు.సీసీ కెమెరాలతో పట్టుబడ్డ నిందితులుకేసు దర్యాప్తులో భాగంగా పోలీసులు పరిసర ప్రాంతాల్లోని సీసీ కెమెరాలను పరిశీలించారు. ఫుటేజీలో సుందర్ అనుమానాస్పదంగా మృతదేహాన్ని తరలిస్తున్నట్లు గుర్తించారు. సీసీ ఫుటేజీ, సాంకేతిక ఆధారాలు, స్థానికుల సమాచారంతో నిందితులపై నిఘా పెట్టిన ప్రత్యేక బృందాలు శుక్రవారం ఉదయం సూర్యాపేట కొత్త బస్టాండ్ వద్ద షరీఫ్, సుందర్‌ను అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేశాయి.వారి వద్ద నుంచి హత్యకు ఉపయోగించిన గుదిబండ, ఏ–1 షరీఫ్‌కు చెందిన మోటార్‌సైకిల్, రెండు సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. విచారణలో నిందితులు నేరాన్ని అంగీకరించినట్లు ఎస్పీ తెలిపారు. వారిని రిమాండ్‌కు తరలించనున్నట్లు వెల్లడించారు.కేసు దర్యాప్తులో పారదర్శకత కోసం దర్యాప్తు బాధ్యతలను సూర్యాపేట డీఎస్పీ ప్రసన్న కుమార్‌కు అప్పగించినట్లు ఎస్పీ తెలిపారు. కేసును ఛేదించడంలో కీలకంగా పనిచేసిన కోదాడ డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, సూర్యాపేట డీఎస్పీ ప్రసన్నకుమార్, మునగాల సీఐ రామకృష్ణారెడ్డి, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్, ఎస్సై లచ్చిరెడ్డి, సీసీఎస్ ఎస్సైలు సాయిరాం, హరికృష్ణతో పాటు సిబ్బందిని ఎస్పీ అభినందించి రివార్డులు అందజేశారు.

## ఆర్యవైశ్యులు సమాజ సేవలో ముందుండాలి



**ముద్ర, దేవరకొండ:** ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు సంఘం సభ్యుల బలోపేతానికి కృషి చేస్తూ మరో పక్క సమాజ సేవలో సహితం ముందుండాలని దేవరకొండ మున్సిపల్ మాజీ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు పానుగంటి మల్లయ్య అన్నారు. శుక్రవారం స్థానిక వాసవీ మాత ఆలయంలో నూతనంగా ఎన్నికైన పట్టణ ఆర్యవైశ్య సంఘం, యువజన సంఘం సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. అనంతరం వారిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం పట్టణాధ్యక్షుడు ఊరె జనార్ధన్, ప్రధాన కార్యదర్శి దాచేపల్లి వెంకటేశ్వర్లు, కోశాధికారి కొత్త వెంకటేశ్వర్లు, యుజన సంఘం అధ్యక్షుడు బూరుగు శివశంకర్, ప్రధాన కార్యదర్శి సముద్రాల అజయ్ కుమార్, కోశాధికారి కామిశెట్టి వంశీకృష్ణ, వనితా క్లబ్ అధ్యక్షురాలు సముద్రాల స్వప్న, ప్రధానకార్యదర్శి దొడ్డి రమ, కోశాధికారి వాస నీరజ, ఇతర కార్యవర్గ సభ్యులు, సంఘం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## రైతులు ఆరుతడి పంటలు సాగు చేయాలి

**కలెక్టర్ అనురాగ్ జయంతి**



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** వరి సాగుకు బదులుగా ఆరుతడి పంటలు సాగు చేయాలని రైతులకు జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి ఒక ప్రకటనలో తెలిపారు.ప్రస్తుత వాతావరణ, నీటి లభ్యత పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని జిల్లాలోని రైతులు ఈ వానాకాలంలో వరి పంట సాగు విషయంలో అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి సూచించారు. వరి సాగుకు అవసరమైన నీరు, అందుబాటులో ఉండే పరిస్థితి లేకపోవడంతో రైతులు ప్రత్యామ్నాయంగా ఆరుతడి పంటల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. బోర్లలో ప్రస్తుతం నీరు అందుబాటులో ఉన్నప్పటికీ విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడే అవకాశం ఉందని, అదే విధంగా విద్యుత్ సరఫరా అందుబాటులో ఉన్నప్పటికీ భూగర్భ జలాల లభ్యత తగ్గే అవకాశం ఉందని కలెక్టర్ తెలిపారు.రైతులు నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని 22 రకాల ఆరుతడి పంటలను సాగు చేయాలని సూచించారు. ఈ పంటలకు ప్రభుత్వం కనీస మద్దతు ధర (ఎంఎస్ పి ) కల్పిస్తోందని, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా పంటలను కొనుగోలు చేసే అవకాశం కూడా ఉందని తెలిపారు. ప్రతి వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఇవో) తమ పరిధిలో 500 ఎకరాల వరి సాగు విస్తీర్ణాన్ని ఆరుతడి పంటల వైపు మళ్లించేలా రైతులకు అవగాహన కల్పించి, ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. రైతులు అధికారుల సూచనలు పాటించి, తక్కువ నీటితో సాగు చేయగల ఆరుతడి పంటలను ఎంచుకుని, పంట వేయాలని కలెక్టర్ కోరారు.

# ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహించడం అభినందనీయం

**జిల్లా ఎస్పీ అక్షాన్ష్ యాద**
**భువనగిరి కేవీ స్కూల్‌లో**
**ఇంటీరిసే ఇన్స్పైర్ అవార్డ్స్ -2026**



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహించడం అభినందనీ యమని జిల్లా ఎస్పీ అక్షాన్ష్ యాదవ్ అన్నారు.హైదరాబాద్ యాదగిరి టోల్‌వే ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహించే ఉద్దేశంతో భువనగిరి కేవీ స్కూల్‌లో ఇంటీరిసే ఇన్స్పైర్ అవార్డ్స్ 2026 కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై భువనగిరి, బీబీనగర్ పరిధిలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో అత్యధిక మార్కులు సాధించిన ప్రతిభావంతులైన విద్యార్థులకు ఇంటీరిసే ఇన్స్పైర్ అవార్డ్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల విద్యా ప్రతిభను గుర్తించి, వారిని మరింత ఉన్నత లక్ష్యాల వైపు ప్రోత్సహించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. అవార్డుల ప్రదానోత్సవం అనంతరం విద్యార్థులు తమ ప్రతిభ, సృజనాత్మకత, సాంస్కృతిక నైపుణ్యాలను చాటుతూ వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీసి ప్రోత్సహిస్తున్న పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, కార్యక్రమ నిర్వాహకులను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో డీస్పీ ప్రభాకర్ రెడ్డి, భువనగిరి టౌన్ సిఐ శ్రీ రమేష్, ట్రాఫిక్ సీ ఐ శ్రీ మధుసుధన్, ఎస్ ఐ లు, పోలీసు సిబ్బంది, కేవీ స్కూల్ యాజమాన్యం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఆండాళ్ అమ్మవారికి నవకలశ పంచామృతాభిషేకం



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** స్వర్ణగిరి దివ్య క్షేత్రంలో శుక్రవారం పుబ్బ నక్షత్రం పురస్కరించుకొని శ్రీ ఆండాళ్ అమ్మవారి కి నవకలశ పంచామృత అభిషేకాన్ని అర్చక స్వాములు ఘనంగా నిర్వహించారు. అనంతరం అమ్మవారిని పట్టు చీరతో దివ్యాభరణాలతో పుష్ప మాలికలతో అలంకరించి అష్టలక్ష్మి మంటపంలోకొలువుదీర్చారు.. అష్ట ఐశ్వర్య ప్రాప్తి కోసం మహాలక్ష్మి హావనం నిర్వహించారు. శ్రావణ మాసం సందర్భంగా సాయంత్రం శ్రీ పద్మావతి అమ్మవారి కి విశేషంగా సహస్ర కుంకుమార్చన సేవ అర్చక స్వాములు నిర్వహించారు.

## జర్నలిస్టుల సమస్యలపై ఐజేయూ నిరంతర పోరాటం చేస్తుంది



**ముద్ర, తుంగతుర్తి:** జర్నలిస్టుల సమస్యలపై టి యు డబ్ల్యు జే( ఐ జేయు) నిరంతర పోరాటం చేస్తుందని జిల్లా ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి అక్రిడేషన్ కమిటీ సభ్యులు శంకరమంచి రవీందర్ శర్మ అన్నారు శుక్రవారం మండల కేంద్రంలో మండల జర్నలిస్టుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు, ఇప్పటివరకు జిల్లాలో అర్హులైన వారందరికీ అక్రిడేషన్ కార్డులు మంజూరయ్యాయని అన్నారు, అక్రిడేషన్ కార్డులు అనేది నిరంతర ప్రక్రియ అని అన్నారు, జర్నలిస్టుల సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తామని అన్నారు, తెలంగాణలో జర్నలిస్టుల సమస్యలపై టి యు డబ్ల్యూ జే ఐజేయు కు పూర్తి అవగాహన ఉందని అన్నారు, ప్రతి ఒక్క జర్నలిస్టు కు ఇళ్లస్థలాలు, హెల్త్ కార్డులు ఇప్పించేందుకు కృషి చేస్తున్నామని అన్నారు, రాష్ట్ర ఐజేయు ఆదేశాల మేరకు ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా ఆయన వ్యవహరించారు అనంతరం నూతన మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు, అధ్యక్షుడుగా పూసపల్లి యాదగిరి, ఉపాధ్యక్షులుగా ఓరుగంటి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా కోదాటి విక్రమ్, కోశాధికారిగా కొండగడుపుల ఎల్లయ్యను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు తాళ్లపల్లి సోమన్న, వడ్లకొండ శ్రీనివాస్, ఎండి నసిరుద్దీన్, ఎండి మాజిద్, అండం సైదులు, భూపతి సైదులు, వర్ధల్లి వీరమల్లు, బింగి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## ఖమ్మంలో యువకుడి దారుణ హత్య

**ముద్ర ప్రతినిధి, ఖమ్మం:** నగరంలోని త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. రంగనాయకుల గుట్ట సమీపంలో ఇద్దరు యువకుల మధ్య జరిగిన ఘర్షణలో కత్తితో దాడి చేయడంతో దండేటి శ్రీనాథ్ (24) మృతి చెందాడు.పోలీసుల కథనం ప్రకారం.. రంగనాయకుల గుట్టకు చెందిన దండేటి శ్రీనాథ్ ఫ్లెక్సీ వర్కర్‌గా పనిచేస్తున్నాడు. అతనికి అదే ప్రాంతానికి చెందిన వేముల మధు (28)తో గొడవ జరిగినట్లు సమాచారం. ఈ క్రమంలో మధు కత్తితో శ్రీనాథ్‌పై దాడి చేసినట్లు తెలుస్తోంది.కత్తిపోట్లకు గురైన శ్రీనాథ్ రంగనాయకుల గుట్ట సమీపంలోని కాలువలో అపస్మారక స్థితిలో పడి ఉండగా స్థానికులు గుర్తించి ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.సమాచారం అందుకున్న త్రీ టౌన్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుడు మధు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. నిందితుడి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి.

## అమెరికాలో సత్తుపల్లి యువకుడి మృతి

**నిద్రలోనే గుండెపోటుతో కన్నుమూసిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్**

**ముద్ర ప్రతినిధి, ఖమ్మం:** ఉజ్వల భవిష్యత్తు కోసం సుదూర ప్రాంతానికి వెళ్లిన ఆ ఇంట్లో తీవ్ర విషాదం నిండింది. ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం కిష్టారం గ్రామానికి చెందిన ములకలపాటి పార్థసారధి (35) అమెరికాలో ఆకస్మికంగా గుండెపోటుతో మృతి చెందారు.కిష్టారం గ్రామానికి చెందిన ములకలపాటి రవి – లీలావతి దంపతుల కుమారుడైన పార్థసారధి గత పదేళ్లుగా అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా స్థిరపడి ఉద్యోగం చేస్తున్నారు. ఇటీవల అమెరికాలోని నార్త్ కరోలినాలో నివాసముంటున్న తన సోదరి సీమంతం వేడుకల కోసం ఆయన అక్కడికి వెళ్లారు. కుటుంబ సభ్యులు, బంధువులతో ఎంతో సంతోషంగా గడిపిన పార్థసారధి, వేడుకలు ముగిసిన అనంతరం ఉదయం ఎంతకీ నిద్రలేవలేదు.సంశయించిన కుటుంబ సభ్యులు ఆయనను నిద్ర లేపేందుకు ప్రయత్నించగా, ఎలాంటి స్పందనా లేకపోవడంతో వెంటనే స్థానిక వైద్యులకు సమాచారం అందించారు. వైద్యులు పరిశీలించి, ఆయన నిద్రలోనే తీవ్ర గుండెపోటుతో కన్నుమూసినట్లు ధ్రువీకరించారు. ఎంతో భవిష్యత్తు ఉన్న యువకుడు, ఎల్లప్పుడూ నవ్వుతూ పలకరించే పార్థసారధి హఠాన్మరణ వార్త వినగానే కిష్టారం గ్రామంలో శోకఛాయలు అలముకున్నాయి. చేతికి అందిన కుమారుడు తిరిగిరాని లోకాలకు వెళ్లిపోవడంతో తల్లిదండ్రులు రవి, లీలావతి దంపతులు కన్నీరుమున్నీరవుతున్నారు. పార్థసారధి భౌతికకాయాన్ని స్వగ్రామానికి రప్పించేందుకు స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రభుత్వం చొరవ చూపాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## డీపీఆర్వో శ్రీనివాస్ సతీమణి మృతికి టీయూడబ్ల్యూజే ఐజేయూ నేతల సంతాపం

**ముద్ర, సూర్యాపేట:** జిల్లా డీపీఆర్వో వల్లోజు శ్రీనివాస్ సతీమణి వల్లోజు విజయలక్ష్మి అకాల మరణం పట్ల టీయూడబ్ల్యూజే ఐజేయూ సూర్యాపేట జిల్లా నాయకులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. విజయలక్ష్మి పార్థివదేహానికి నివాళులర్పించి, డీపీఆర్వో శ్రీనివాస్‌ను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌తో పాటు కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. విజయలక్ష్మి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని కుటుంబ సభ్యులకు ప్రసాదించాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే ఐజేయూ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చలసాని శ్రీనివాసరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ కృష్ణ బంటు, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షుడు బత్తుల మల్లికార్జున్, జిల్లా ప్రధాన కార్యదర్శి రెబ్బ విజయ్ కుమార్, సూర్యాపేట పట్టణ ప్రెస్ క్లబ్ సంయుక్త కార్యదర్శి, సీనియర్ జర్నలిస్ట్, టీయూడబ్ల్యూజే ఐజేయూ జిల్లా నాయకులు రషీద్ షేక్, యూనియన్ నాయకులు కందుకూరి యాదగిరి, దుస్స చంద్రశేఖర్, సందీప్, రాము తదితరులు పాల్గొన్నారు.విజయలక్ష్మి మృతి పట్ల వారు తీవ్ర విచారం వ్యక్తం చేస్తూ డీపీఆర్వో శ్రీనివాస్, వారి కుటుంబ సభ్యులకు మరోసారి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
శనివారం 15.08.2026
www.mudranews.in | @mudranews



**మధుమేహం, రక్తహీనతకు శనగపప్పు:**

ఐరన్, ప్రోటీన్, ఫైబర్ సమృద్ధిగా ఉండే శనగపప్పు హిమోగ్లోబిన్‌కు, రక్తంలో చక్కెర నియంత్రణకు ఉపయోగపడుతుంది.



## త్రివర్ణమయం... కలెక్టరేట్



80 వ స్వాతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా మెదక్ కలెక్టరేట్ త్రివర్ణ మయంగా మారింది. విద్యుత్ దీపాలతో అలంకరించారు. అలాగే చరిత్రాత్మక ఖిల్లాను మూడు రంగుల విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశారు. చీకటి వేళలో ముస్తాబైన ఖిలా మువ్వనీలతో పట్టణ ప్రజలను ఆకట్టుకుంటోంది. - ముద్ర ప్రతినిధి, మెదక్

# స్వాతంత్ర్య ఉద్యమంలో తెలంగాణ పాత్ర

(ముద్ర డెస్క్)

**తెలంగాణ స్వాతంత్ర్యోద్యమానికి ఒక ప్రత్యేక స్వభావం ఉంది. దేశంలోని అనేక ప్రాంతాల్లో పోరాటం ప్రధానంగా బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా సాగితే, హైదరాబాద్ సంస్థానంలోని తెలంగాణలో పోరాటం రెండు స్థాయిల్లో సాగింది.ఒకటి – భారత స్వాతంత్ర్యోద్యమ ప్రభావంతో జాతీయ, ప్రజాస్వామ్య హక్కుల కోసం పోరాటం. రెండోది – నిజాం నిరంకుశ పాలన, భూస్వామ్య దోపిడీ, వెట్టిచాకిరీకి వ్యతిరేకంగా రైతాంగ పోరాటం.అందుకే తెలంగాణ చరిత్రలో స్వాతంత్ర్యోద్యమం కేవలం 1947 ఆగస్టు 15తో ముగిసిన అధ్యాయం కాదు. 1948 సెప్టెంబర్ 17 వరకు సాగిన హైదరాబాద్ విమోచన ఉద్యమం, దానితో ముడిపడిన రైతాంగ పోరాటం కూడా తెలంగాణ స్వాతంత్ర్య చరిత్రలో కీలక భాగాలుగా నిలిచాయి.**







భారత స్వాతంత్ర్యోద్యమ చరిత్రలో తెలంగాణ పాత్రను కేవలం 1947కు ముందు జరిగిన బ్రిటిష్ వ్యతిరేక పోరాటంతో మాత్రమే పరిమితం చేయలేం. అప్పటి హైదరాబాద్ సంస్థానంలో నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా సాగిన ప్రజాస్వామ్య ఉద్యమం, పౌరహక్కుల పోరాటం, సామాజిక సంస్కరణలు, రైతాంగ ప్రతిఘటన, వెట్టిచాకిరీ వ్యతిరేక ఉద్యమం కూడా స్వాతంత్ర్య పోరాటంలో అంతర్భాగంగా చూడాలి. 1930లో జోగిపేటలో జరిగిన తొలి మహాసభతో తెలంగాణలో సామాజిక, సాంస్కృతిక, విద్యా చైతన్యానికి కొత్త ఊపు వచ్చింది. ప్రారంభ దశలో ఆంధ్ర మహాసభ ప్రధానంగా విద్యాభివృద్ధి మాతృభాషలో విద్య సామాజిక సంస్కరణలు వెట్టిచాకిరీ నిర్మూలన గ్రామీణ ప్రజల సమస్యలు పౌరహక్కులు వంటి అంశాలను ముందుకు తీసుకెళ్లింది. తరువాత రైతాంగ సమస్యలు, భూస్వాముల దోపిడీ, వెట్టిచాకిరీ వంటి అంశాలు ప్రధానంగా మారాయి. దీంతో ఆంధ్ర మహాసభ తెలంగాణ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలను సంఘటితం చేసిన ముఖ్యమైన వేదికగా ఎదిగింది.

**హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్ ఆవిర్భావం**

భారత జాతీయ కాంగ్రెస్ ప్రభావంతో హైదరాబాద్ సంస్థానంలోనూ బాధ్యతాయుత ప్రభుత్వం కోసం డిమాండ్ పెరిగింది. హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్ ప్రజాస్వామ్య హక్కుల కోసం ఉద్యమించింది. స్వామి రామానంద తీర్థ ఈ ఉద్యమానికి ప్రముఖ నాయకుడిగా ఎది గారు. నిజాం పాలనలో ప్రజలకు రాజకీయ ప్రాతినిధ్యం, బాధ్యతాయుత ప్రభుత్వం, పౌరహక్కులు కల్పించాలని ఆయన నాయకత్వంలో ఉద్యమం సాగింది. హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్‌పై నిజాం ప్రభుత్వం నిషేధం విధించినప్పటికీ ఉద్యమకారులు వెనుకడుగు వేయలేదు. సత్యాగ్రహాలు, నిరసనలు, ప్రజా కార్యక్రమాల ద్వారా ప్రజల్లో రాజకీయ చైతన్యాన్ని పెంచారు. వందేమాతరం ఉద్యమం తెలంగాణ, హైదరాబాద్ సంస్థానంలో విద్యార్థులు కూడా జాతీయో ద్యమంలో కీలక పాత్ర పోషించారు. హైదరాబాద్‌లోని ఉస్మానియా విశ్వ విద్యాలయంలో వందేమాతరం ఉద్యమం విద్యార్థుల్లో జాతీయ భావాలను బలపరిచింది. విద్యార్థులు వందేమాతరం ఆలపించడంపై ఆంక్షలు విధించడంతో నిరసనలు చెలరేగాయి. అనేక మంది విద్యార్థులు ఉద్యమంలో పాల్గొన్నారు. కొందరు విద్యార్థులు విద్యా సంస్థల నుంచి బహిష్కరణకు గురయ్యారు. ఈ ఉద్యమం తెలంగాణలోని యువతలో జాతీయ చైతన్యం పెరగడానికి దోహద పడింది. రైతాంగంపై దోపిడీ – పోరాటానికి కారణం భూస్వాములు, దొరల కోసం ఉచితంగా శ్రమ చేయాల్సిన పరిస్థితి. రైతులపై వివిధ రకాల పన్నులు, వసూళ్లు భారంగా ఉండేవి. గ్రామీణ ప్రాంతాల్లో దేశ్‌ముఖ్‌లు, జాగీర్దార్లు, దొరల ఆధిపత్యం కొనసాగేది. భూమి సమస్య: సాగు చేస్తున్న రైతులకు భూమిపై పూర్తి హక్కులు ఉండేవి కాదు.ఈ దోపిడీకి వ్యతిరేకంగా రైతులు క్రమంగా సంఘటితమయ్యారు.

**చాకలి ఐలమ్మ**

తెలంగాణ రైతాంగ పోరాట చరిత్రలో చాకలి ఐలమ్మ పేరు ప్రత్యేకంగా నిలిచింది. విసునూరు దేశ్‌ముఖ్ ఆధిపత్యానికి వ్యతిరేకంగా తన భూమి హక్కు కోసం ఆమె పోరాడారు. భూస్వామ్య దోపిడీకి తలొగ్గకుండా తన భూమిని కాపాడుకోవడానికి ఆమె చేసిన ప్రతిఘటన గ్రామీణ ప్రజలకు స్ఫూర్తినిచ్చింది. ఐలమ్మ పోరాటం వ్యక్తిగత భూమి సమస్యను దాటి రైతు హక్కుల ప్రతీకగా మారింది.

**కొమురం భీం**

ఆదిలాబాద్ ప్రాంతానికి చెందిన కొమురం భీం గిరిజన హక్కుల కోసం పోరాడిన ప్రముఖ నాయకుడు. గిరిజనులకు అడవిపై, భూమిపై హక్కు ఉండాలని ఆయన నినదించారు."జల్, జంగల్, జమీన్" అనే నినాదంతో గిరిజనుల హక్కుల కోసం ఆయన పోరాటం సాగింది. 1947 – భారత్‌కు స్వాతంత్ర్యం1947 ఆగస్టు 15న భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చింది. అయితే హైదరాబాద్ సంస్థాన పరిస్థితి భిన్నంగా ఉంది. నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్ హైదరాబాద్ సంస్థానాన్ని భారత దేశంలో విలీనం చేయకుండా స్వతంత్రంగా కొనసాగించాలని ప్రయత్నించారు. భారత ప్రభుత్వం, హైదరాబాద్ సంస్థానం మధ్య స్టాండ్‌స్టిల్ ఒప్పందం కుదిరినా సమస్య పరిష్కారం కాలేదు.మరోవైపు హైదరాబాద్ సంస్థానంలో ప్రజాస్వామ్య హక్కుల కోసం ఉద్యమం కొనసాగింది. ఈ సమయంలో మజ్లిస్–ఇత్తెహాదుల్ ముస్లిమీన్ ఆధ్వర్యంలో ఖాసిం రజ్వీ నాయకత్వంలో రజాకార్ దళాలు బలపడ్డాయి. రజాకార్లు నిజాం పాలనకు మద్దతుగా వ్యవహరిస్తూ ప్రజా ఉద్యమాలను అణచివేయడానికి ప్రయత్నించారు. గ్రామీణ ప్రాంతాల్లో హింస, బెదిరింపులు, దాడులు చోటుచేసుకున్నాయి. దీంతో తెలంగాణలో ప్రజా ప్రతిఘటన మరింత తీవ్రరూపం దాల్చింది. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం1946లో ప్రారంభమైన తెలంగాణ రైతాంగ పోరాటం 1947 తర్వాత మరింత విస్తరించింది. హైదరాబాద్ సంస్థానంలో పరిస్థితులు తీవ్రరూపం దాల్చడంతో భారత ప్రభుత్వం 1948 సెప్టెంబర్‌లో సైనిక చర్య చేపట్టింది. దీనినే 'ఆపరేషన్ పోలో' లేదా సాధారణంగా 'పోలీస్ యాక్షన్' అని పిలుస్తారు.1948 సెప్టెంబర్ 13న ప్రారంభమైన ఈ చర్య కొన్ని రోజులకే ముగిసింది. 1948 సెప్టెంబర్ 17న నిజాం భారత యూనియన్‌లో విలీనాన్ని అంగీకరించారు. దీంతో హైదరాబాద్ సంస్థానం భారత దేశంలో భాగమైంది. చివరకు 1951లో కమ్యూనిస్టు పార్టీ సాయుధ పోరాటాన్ని విరమించింది.

# చైనా, భారత్ జట్టు.. అమెరికాకు కడుపుమంట

**ముద్ర, డెస్క్:**





అగ్రరాజ్యం అమెరికా.. ఆసియాలో అగ్రరాజ్యం, ప్రపంచంలో రెండో ఆర్థిక శక్తిగా ఎదిగిన దేశం చైనా. ఈ రెండు దేశాల మధ్య పోటీ కొనసాగుతోంది. అగ్రస్థానం కోసం చైనా పోటీపడుతోంది. చైనాను ఎదగకుండా చేయాలని అమెరికా ప్రయత్నిస్తోంది. ఈ క్రమంలో ఆసియాలో రెండు అతిపెద్ద దేశాలు, శక్తివంతమైన దేశాలుగా ఉన్న చైనా, భారత్ జట్టుకట్టకుండా అమెరికా పుల్లలు పెడుతూనే ఉంటుంది. అయినా ఇరు దేశాల మధ్య వైరుధ్యాలు ఉన్నపట్టికి పరస్పర సహకారం కూడా కొనసాగుతోంది. తాజాగా అమెరికా చైనా తయారీ వస్తువులపై తను విధించిన భారీ పన్నులను తప్పించుకోవడంలో భారత్ సహకరిస్తోందని ఆరోపణలు చేస్తోంది. షాడో నెట్‌వర్క్ అని..పీటర్ నవారో విడుదల చేసిన 'ది గ్రేట్ ట్రాన్స్‌షిప్‌మెంట్ స్కామ్' నివేదికలో అమెరికా భారత్‌తోపాటు మరో 40 దేశాలను లక్ష్యంగా చేసుకుంది. చైనా వస్తువులు మధ్యలో ఇతర దేశాల మీదుగా తిరిగి వచ్చి అమెరికా మార్కెట్‌లోకి ప్రవేశిస్తున్నాయని వాదిస్తోంది. రీలేబులింగ్, రీప్యాకేజింగ్, మార్గం మార్చడం వంటి పద్ధతులు ఉపయోగిస్తున్నారని చెప్తోంది. కానీ నిజానికి ఇది అమెరికా తన స్వంత వాణిజ్య నియమాలను ఇతరులపై రుద్దాలని చూస్తున్నప్పుడు వచ్చే అసహనం మాత్రమే అని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. 2018 నుంచి ఆంక్షలు..చైనాపై సెక్షన్ 301 కింద టారిఫ్‌లు విధించినప్పటి నుంచి అక్రమ సరుకు రవాణా పెరిగిందని, దాని విలువ 303 బిలియన్ డాలర్ల వరకు ఉంటుందని అంచనా వేస్తోంది. కార్మికుల ఖర్చు తక్కువగా ఉన్న, కస్టమ్స్ పర్యవేక్షణ సడలంగా ఉన్న దేశాల ద్వారా వస్తువులు తరలిస్తున్నారని చెప్తోంది. అయితే ఈ వాదనలోనే అమెరికా బలహీనత కనిపిస్తోంది. తన మార్కెట్‌లోకి చేరే వస్తువులను 'చైనా తయారీ' అని గుర్తించలేకపోగా, దానికి బదులు ఇతర దేశాలను నిందించడం అమెరికా వైఫల్యాన్ని బయటపెడుతోంది. ఏఐ టూల్‌తో గుర్తించాలని..'డిటెక్టివ్ బోర్డర్' అనే కొత్త ఏఐ సాధనంతో షిప్‌మెంట్ రికార్డులు, రూటింగ్ చరిత్ర, యజమానుల సంబంధాలను పరిశీలించి నిజమైన మూలాన్ని కనుగొంటామని అమెరికా చెబుతోంది. ఇది హాస్యాస్పదంగా ఉంది. చైనా, భారత్ వంటి దేశాలు తమ వాణిజ్య మార్గాలను సమర్థవంతంగా ఉపయోగిస్తున్నప్పుడు అమెరికా ఆందోళన చెందుతుంది. ఇది కేవలం పోటీలో వెనకబడినప్పుడు వచ్చే కడుపుమంటలాంటిదే. చైనా–భారత్ కలయిక అమెరికాకు నిజంగా బాధ కలిగిస్తోంది. సొంత ప్రయోజనాలను కాపాడుకుంటూ పరస్పర అవగాహన, సహకారంతో ముందుగు సాగుతున్నప్పుడు నిందలు మోపడం అమెరికాకు అలవాటైంది. ఇది తన బలహీనతను చూపిస్తోంది.

## సమాచారాన్ని అందించేందుకుకే పునఃసర్వే

**కలెక్టర్ ప్రతిమా సింగ్**



**ముద్ర ప్రతినిధి, మెదక్:** ప్రజలకు విశ్వసనీయమైన సర్వే సమాచారాన్ని అందించడమే లక్ష్యంతో పునఃసర్వే నిర్వహించాలని కలెక్టర్ ప్రతిమసింగ్ లైసెన్స్ సర్వేయర్లను ఆదేశించారు.శుక్రవారం కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్ చాంబర్లో జిల్లాలో పునఃసర్వే పనులు చేపట్టేందుకు నిర్దేశిత అర్హత/శిక్షణను విజయవంతంగా పూర్తి చేసిన 20 మంది అర్హులైన అభ్యర్థులకు సర్వే, భూ రికార్డుల శాఖకు చెందిన సంబంధిత అధికారుల సమక్షంలో ఎంపికైన అభ్యర్థులకు లైసెన్సులను అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ... భూమి రికార్డులను నవీకరించడం, మెరుగుపరచడం, ఖచ్చితమైన సర్వే సరిహద్దులను స్థాపించడం, భూ యజమానులకు, ప్రజలకు విశ్వసనీయమైన సర్వే సమాచారాన్ని అందించడం అనే లక్ష్యంతో పునఃసర్వే కార్యక్రమాన్ని చేపట్టాలని, లైసెన్స్ పొందిన సర్వే అభ్యర్థులు, సర్వే, భూ రికార్డుల శాఖ నిర్దేశించిన సాంకేతిక విధానాలు, నియమాలు, సూచనల ప్రకారం పునఃసర్వే కార్యకలాపాలను నిర్వహించడంలో సహాయపడతారన్నారు. ఈ కార్యక్రమంలో ఏడి ల్యాండ్ సర్వే కిషన్, సంబంధిత ల్యాండ్ సర్వీస్ సిబ్బంది లైసెన్స్ సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

## కైలాస్ నాగేష్‌ను పరామర్శించిన డాక్టర్ కె. లక్ష్మణ్



**ముద్ర, హైదరాబాద్:** శస్త్రచికిత్స అనంతరం కోలుకుంటున్న మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ ప్రైవేట్ సెక్రెటరీ కైలాస్ నాగేష్‌ను పార్లమెంట్ సభ్యుడు, బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కె. లక్ష్మణ్ పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కైలాస్ నాగేష్ డాక్టర్ కె. లక్ష్మణ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. తనను పరామర్శించి ధైర్యం చెప్పిన ఓబీసీ మోర్చా జాతీయ నాయకుడు పూస రాజు, మాజీ కార్పొరేటర్ రవిచారి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సి. పార్థసారథి, ఉపేందర్ రెడ్డి, ప్రభు గుప్తలకు కూడా ధన్యవాదాలు తెలిపారు. శస్త్రచికిత్స అనంతరం తన ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని పరామర్శించిన నాయకులు, శ్రేయోభిలాషులకు కైలాస్ నాగేష్ కృతజ్ఞతలు తెలియజేశారు.

## తీర్థయాత్రకు వెళ్తూ అనంత లోకాలకు..

**రోడ్డు ప్రమాదంలో మహారాష్ట్రకు చెందిన ఇద్దరు మహిళలు మృతి**

**మరో ఇద్దరికి తీవ్ర గాయాలు**

**ఆగి ఉన్న టూరిస్ట్ బస్సును వెనుక నుంచి ఢీకొట్టిన లారీ**

**ఆర్మూర్ మండల పరిధిలోని గోవింద్‌పేట్ బ్రిడ్జి వద్ద ఘటన**

**ముద్ర, నిజామాబాద్:** తీర్థయాత్రకు బయలేరిన భక్తులకు ఆర్మూర్ మండల పరిధిలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదం తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. జాతీయ రహదారిపై టైర్ పంక్చర్ కావడంతో ఆగిఉన్న టూరిస్ట్ బస్సును వెనుక నుంచి వేగంగా వచ్చిన లారీ ఢీ కొనడంతో ఇద్దరు మహిళలు అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా కిన్వట్ ప్రాంతానికి చెందిన భక్తులు హైదరాబాద్‌లోని చిన్న జీయర్ స్వామి దర్శనం కోసం రెండు టూరిస్టు బస్సుల్లో బయల్దేరారు. ఆర్మూర్ పట్టణంలోని గోవింద్‌పేట్ శివారులోఉన్న బ్రిడ్జి సమీపానికి చేరుకున్న సమయంలో ముందుగా వెళ్తున్న టూరిస్టు బస్సు టైర్ పంక్చర్ కావడంతో రెండు బస్సులను జాతీయ రహదారిపై నిలిపివేశారు. టైరు పంక్చర్ కావడంతో బస్సులోని కొంతమంది ప్రయాణికులు కిందకు దిగి, రహదారి మధ్యలో ఉన్న డివైడర్‌పై కూర్చొని విశ్రాంతి తీసుకుంటున్నారు. అదే సమయంలో వెనుక వైపు నుంచి వస్తున్న లారీ డ్రైవర్ ఆగిఉన్న టూరిస్టు బస్సును ఢీకొట్టాడు.దీంతో బస్సు ముందుకు కదిలి డివైడర్ ప్రాంతంలో కూర్చున్న ప్రయాణికులపైకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో సుజాత(54), మాధవి(47) తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందారు. మరో ఇద్దరు సునీత,చిట్టక్కకు తీవ్ర గాయాలు కావడంతో ప్రభుత్వ దవాఖానకు తరలించారు. సమాచారం అందుకున్న ఎస్‌హెచ్‌వో సత్యనారాయణగౌడ్ ఘటనా స్థలానికి చేరుకొని, అక్కడ ఏర్పడిన ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. సీపీ సాయి చైతన్య ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ప్రమాదం జరిగిన తీరును సంబంధిత పోలీస్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. కేసు నమోదు చేసి ప్రమదానికి గల పూర్తి కారణాలపై దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు తెలిపారు. లారీ డ్రైవర్ నిర్లక్ష్యం,అతి వేగం తదితర అంశాలను పోలీసులు పరిశీలిస్తున్నట్లు తెలిపారు.

## కేబీఆర్ పార్క్ చుట్టూ వన్‌వే..

**వాకర్లతో ట్రాఫిక్ అధికారుల సమావేశం**




**ముద్ర, హైదరాబాద్:** నగరంలోని కేబీఆర్ పార్క్ చుట్టూ ప్రతిపాదించిన వన్ వే ట్రాఫిక్ నిబంధనల అమలుపై హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు శుక్రవారం ఉదయం కేబీఆర్ పార్క్ వాకర్లతో బహిరంగ చర్చ నిర్వహించారు. ఈనెల 18 నుంచి అమల్లోకి రానున్న ట్రాఫిక్ మార్పుల గురించి వాకర్లకు అధికారులు వివరించారు. కొత్త ట్రాఫిక్ విధానం సులభంగా, క్రమబద్ధంగా అమలయ్యేందుకు పార్క్ సందర్శకులు, వాహనదారులు పూర్తి సహకారం అందించాలని కోరారు. ఈ మేరకు వాకర్లకు పోలీసులు కొన్ని సూచనలు చేశారు. వాహనాలను.. పార్కింగ్ స్థలాల్లో, మల్టీ–లెవల్ పార్కింగ్ సదుపాయంలో మాత్రమే నిలపాలని తెలిపారు. ఉదయం వేళల్లో రోడ్డుకు ఎదురుగా రాంగ్ రూట్‌లో వాహనాలు నడపకూడదని పేర్కొన్నారు. వన్–వే ట్రాఫిక్ విధానాన్ని విజయవంతం చేసేందుకు విధుల్లో ఉన్న ట్రాఫిక్ పోలీసులకు సహకరించాలని కోరారు. నూతన ట్రాఫిక్ నిబంధనలపై కేబీఆర్ పార్క్ వాకర్ల నుంచి సలహాలు, సూచనలను స్వీకరించేందుకు పార్క్ ముందు QR కోడ్‌ను అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ జోయల్ డేవిస్, ట్రాఫిక్ డీసీపీ కాజల్‌తో పాటు పలువురు ట్రాఫిక్ పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

Printed, Published and owned by Aliminati Indra Reddy Printed at M/s. Kakatiya Printers, 2-24-96/6, Plot No. 26 & 27, L.N. Colony, New IDA, Uppal, Hyderabad500039, Medchal Malkajgiri Dist., Telangana and Published from H.No.7-32/B, Flat No. 202, Sri Sai Heights, Sri Sai Nagar, Street No. 8, Hasbiguda, Medchal Malkajgiri District, Hyderabad 500007, Editor: Y Narender Reddy, RNI. Reg.No.TELTEL/2013/50413. e mail: mudradaily@gmail.com, Cell 9949193555